ఉష్ణోగ్రత
(అంచనా)

19-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	28
తెనాలి	38	28
నరసరావుపేట	37	27
బాపట్ల	37	28
రెంటచింతల	37	28
చీరాల	37	28

అమరావతిలో..



నాగార్జున వర్సిటీలో..



ఆకట్టుకున్న యోగాంధ్ర

అంతర్జాతీయ యోగా దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు రోజుకో థీమ్‌తో యోగా ఆసనాలతో ఆకట్టుకుంటున్నారు. బుధవారం పల్నాడు జిల్లాలో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచిన అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద, కృష్ణానదీ తీరాన, వేలాది మందితో యోగాంధ్ర నిర్వహించారు. గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో వర్సిటీ, అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎనిమిది వేల మంది యోగాసనాలు వేశారు. అటు అమరావతిలో ఇటు నాగార్జునవర్సిటీలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు, నాగలక్ష్మి అరుణ్‌బాబులతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

- అమరావతి, పెదకాకాని (ఆంధ్రజ్యోతి)



అసెంబ్లీ పునాదుల కోసం గుంతలు తీసేందుకు వచ్చిన డ్రిల్లర్

ఐకానిక్ అసెంబ్లీ పనులు .. ప్రారంభం

- ఏర్పాట్లలో కాంట్రాక్టు సంస్థ
- రెండు నెలలుగా భూమి పరీక్షలు
- ఇప్పటికే మొదలైన ఐకానిక్ సెక్రటేరియట్ 1, 2 టవర్ల పనులు

గుంటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి గుండెకాయ అయిన ఐకానిక్ అసెంబ్లీ నిర్మాణ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమయింది. రాజధాని మొత్తానికి తలమానికమైన ఈ నిర్మాణ కాంట్రాక్టును పొందిన ఇంజనీరింగ్ సంస్థ సోమవారం నుంచి పనులను ప్రారంభించింది. నిర్మాణ ప్రాంతంలోకి భారీ డ్రిల్లర్లు, సరంజామాను తరలించి ఏర్పాట్లు చేసుకుంటోంది.

● రెండు నెలలుగా కొనసాగుతున్న పనులు

రాజధాని అమరావతిలో 103 ఎకరాల్లో దాదాపు 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 250 మీటర్ల ఎత్తులో వ్యూ పాయింట్ ఉండేలా నిర్మిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్మాణం కావడంతో నిర్మాణ సంస్థ అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. రెండు నెలలుగా అక్కడి భూమి స్వభావం, నాణ్యతపై అధ్యయనం చేస్తోంది. నిర్మాణానికి కావాల్సిన కొలతలు తీసుకుంటోంది. ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాగా సోమవారం నుంచి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. భారీ డ్రిల్లర్లను నిర్మాణ స్థలంలోకి తరలించి సిద్ధం చేసుకుంటున్నారు. నిర్మాణ పునాదుల కోసం కావాల్సిన గుంతలు తీసే పనులు ప్రారంభించారు.

● గత వారమే మొదలైన జీఏడీ టవర్ల నిర్మాణ పనులు

కిందటివారమే జీఏడీ, సెక్రటేరియట్ టవర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పరిపాలనా భవనాన్ని 17.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 47 అంతస్తులతో నిర్మిస్తున్నారు. దీంతోపాటు



ఐకానిక్ అసెంబ్లీ నిర్మాణం కోసం వేసిన పిల్లర్ బాక్స్

68.88 లక్షల చదరపు అడుగలు విస్తీర్ణంలో 40 అంతస్తులు ఉండేలా సెక్రటేరియట్ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం భావించింది. దీనికి సంబంధించిన ఎల్ఓసీలు ఈనెల 2న పూర్తయ్యాయి. మొత్తం రూ. 3,673.44 కోట్లకు టెండర్లు ఖరారయ్యాయి. దీంతో సెక్రటేరియట్ టవర్ 1, టవర్ 2ల పనులు ప్రారంభమయ్యాయి. కిందటి వారమే పనులు ప్రారంభం కావడంతో పునాదుల్లోకి చేరిన నీరు, బురదను ఇప్పటికే తొలగించివేశారు. ఇప్పటికే కొంతమేర నిర్మాణం జరిగి ఉన్న రాఫ్ట్ ఫౌండేషన్ల వద్ద సేఫ్‌హోల్డులు నిర్మించుకుని తదుపరి పనులకు సన్నద్ధమవుతున్నారు. భారీ వాహనాలు నేరుగా రాఫ్ట్ ఫౌండేషన్ వద్దకు చేరుకునేలా రోడ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేసుకున్నారు. పాడైపోయిన ఐరన్‌రాడ్లను వెల్డింగ్ ద్వారా కట్ చేసి తొలగిస్తున్నారు.

బర్లీ పొగాకు.. రైతుకు ఊరట

ముగిసిన కసరత్తు.. నేటి నుంచి కొనుగోళ్లు

- తొలిసారిగా మార్క్‌ఫెడ్ ద్వారా సేకరణకు సిద్ధం
- పర్చూరులో నేడు ప్రారంభించనున్న వ్యవసాయ శాఖ మంత్రి
- బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతుల హర్షం
- చివరి ఆకు వరకు కొనుగోలు చేయాలని వీసీలో కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

కొనుగోళ్లకు ఏడు కేంద్రాలు

కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం లేకున్నా నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లకు ఏడు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఏఎంసీ పర్చూరు, ఎస్‌డబ్ల్యూసీ చీరాల, జీకే పాలెం(ప్రైవేటు గోడౌన్), సీడబ్ల్యూసీ గుంటూరు, సీడబ్ల్యూసీ పెదకాకాని, ఎస్‌డబ్ల్యూసీ యడ్లపాడు, గుండ్లపల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పర్చూరు ఏఎంసీలో గురువారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కొను గోళ్లను లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఇతర కేంద్రాల్లోనూ కొనుగోళ్లను ఒకటి, రెండు రోజుల్లో మొదలు పెట్టనున్నట్లు మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ అధికారులు తెలిపారు.

(నరసరావుపేట రూరల్, గుంటూరు, బాపట్ల, పర్చూరు - ఆంధ్రజ్యోతి)

రెండు నెలల నుంచి కొనుగోళ్ల లేక అల్లాడుతూ ఆందోళనలో ఉన్న బర్లీపొగాకు రైతుకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది. కొనుగోళ్లు చేస్తే కంపెనీలకు మినహాయింపులు కూడా ఇచ్చింది. సంక్షోభం నుంచి రైతులను ఒడ్డున పడేయడానికి రెండు నెలల్లో ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. అయినా క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు ఆశాజనకంగా లేకపోవడంతో (మిగతా 8వ పేజీలో)



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

ప్రణాళికా బద్ధంగా.. కొనుగోళ్లు

కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రణాళిక బద్ధంగా సాగేందుకు వ్యవసాయశాఖ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ విభాగాలతో బాపట్ల కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటమురళి అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఇందులో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 67,132 ఎకరాల్లో బ్లాక్ బర్లీ పొగాకు సాగుచేయగా ఈ-క్రాప్‌లో 50,513 ఎకరాలే నమోదు చేయడం ఏమిటని వ్యవసాయాధికారులను నిలదీశారు. 28,019 రైతుల వివరాలను మాత్రమే ఈక్రాప్‌లో నమోదు చేయటంపై అసహనం వ్యక్తం చేశారు. వారంలోగా పొగాకు రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. 8331057095 నెంబరుతో టోల్‌ఫ్రీ ఏర్పాటు చేశామన్నారు. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా నేరుగా మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగి పొగాకు కొనడం చిన్న విషయం కాదని, దీనిని రైతులంతా సంబరంలా జరుపుకోవాలని ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, మార్క్‌ఫెడ్ అధికారి కరుణశ్రీ, మార్కెటింగ్‌శాఖాధికారి రమేష్‌బాబు, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.



వేమూరు-చావలి ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (పాత చిత్రం)

రోడ్డు తవ్వి వదిలేశారు

- ఐదు నెలలుగా స్పందించని అధికారులు

వేమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాకపోకలకు రోడ్డు అనువుగా లేదని మరమ్మతులకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి తవ్వి వదిలేశాడు. ఐదు నెలలైనా కాంట్రాక్టరు ఆచూకీ లేకపోగా, అధికారులు కూడా పట్టించుకోవడంలేదు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు గతంలో కన్నా అధ్వానంగా రోడ్డును మార్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేమూరు నుంచి చావలి మార్గంలో ఐదు కి.మీ దూరం కలిగిన ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గత జగన్ ప్రభుత్వంలో రోడ్డు గురించి పట్టించుకోలేదు. ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే ఆనందబాబు రోడ్డు పునః నిర్మాణం కోసం రూ.కోటి నిధులను మంజూరు చేయించారు. జనవరిలో టెండర్ పిలవగా గుంటూరుకు చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. ఆదే నెలలో పనిని ప్రారంభించి రోడ్డును తవ్వేశారు. ఆ తర్వాత అటు వైపు కాంట్రాక్టర్ కానీ, అధికారులు కానీ కన్నెత్తి చూడలేదు. దీంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. వర్షాలతో రోడ్డు అంతా జలమయం కావడంతో పాటు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గం గుండా వెళ్లే వాహన చోదకులు రైతులు అవస్థలు పడుతున్నారు. చావలి, పెరవలి, పెరవలిపాలెం, గూడవల్లి, కోడిపర్రు, పెనుమర్రు, భట్టిప్రోలు మండలంలోని కొన్ని గ్రామాలకు అలాగే చెరుకుపల్లి మండలంలోని కొన్ని గ్రామాలకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు.

వచ్చే నెలలో ప్రారంభం..

వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ విద్యాసాగర్ తెలిపారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు మొదటి దశలోనే వదిలి వెళ్లిపోయారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, ఉన్నతాధికారులతో చర్చించి తక్షణ చర్యలకు ఆదేశించారని తెలిపారు. కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశామని, కాంట్రాక్టును కూడా రద్దు చేసి త్వరలో నోటిఫికేషన్ ద్వారా కాంట్రాక్టు పిలవడం జరుగుతుందన్నారు.

కృష్ణానదిలో జిల్లాల సరిహద్దులు గుర్తింపు

అక్రమంగా ఇసుక తవ్వకాలు చేయరాదని ఆర్డీవోల హెచ్చరిక

కొల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాల మధ్య నెలకొన్న వివాదాలు సద్దుమణిగేలా కృష్ణా, బాపట్ల జిల్లాల రెవెన్యూ అధికారులు కృష్ణానదిలో సరిహద్దులు నిర్ణయించారు. బుధవారం జువ్వలపాలెం, ఆముదాలలంక పరిధిలో రెండు జిల్లాల సరిహద్దులను మచిలీపట్నం ఆర్డీవో స్వాతి, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, సర్వేయర్లు, సబ్ డివిజన్ అధికారుల సహకారంతో హద్దులు గుర్తించారు. బాపట్ల, కృష్ణా జిల్లాలను విడదీసి జెండాలు పాతించారు. ఈ సందర్భంగా ఆర్డీవోలు మాట్లాడుతూ రెండు ప్రాంతాల్లో ఇసుక అక్రంగా తవ్వుతూ ఇరుగ్రామాల వారు ఘర్షణలు పడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారన్నారు. జువ్వలపాలెం, ఆముదాల లంక గ్రామాల పరిధిలో ఉన్న కృష్ణానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవన్నారు. ఎవరూ అనధికారికంగా తవ్వకాలు చేయరాదని హెచ్చరికలు జారీ చేశారు. తవ్వకాలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గస్తీ ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, సీఐ అంజనేయులు, ఎస్ఐ అమరవర్ధన్, ఏఎస్ఐ అర్జున్ పాల్గొన్నారు.



సరిహద్దుల వద్ద జెండాలు పాతుతున్న రెవెన్యూ సిబ్బంది

8

రూ. 3 కోట్లు.. కమీషన్

- జగనన్న కాలనీ భూముల వ్యవహారంలో నేతల వాటా
- భూముల కొనుగోలుపై విజిలెన్స్ విచారణ
- ఎకరాకు రూ.5లక్షలు ఇచ్చామంటున్న రైతులు

సీఆర్డీఏలో జాబ్ మేళా

8

ఉద్యోగాలు పొందిన 110 మంది అభ్యర్థులు

వ్యవసాయ సిబ్బంది అవినీతి ఆరోపణలపై విచారణ

6

- ఒక ఎంపీఈఓ సరెండర్, ముగ్గురికి షోకాజ్ నోటీసులు



8

మహిళల భద్రతలో రాజీ లేని పోరాటం

- జాతీయ మహిళా కమిషన్ మెంబర్ అర్చన మజుందార్

సజ్జల, కొమ్మినేని వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ మెంబర్ అర్చన మజుందార్‌కు ఫిర్యాదు చేస్తున్న రాజధాని మహిళలు

ఉపాధ్యాయులు ఎక్కడ?

- బదిలీలతో పల్లెల్లోని బడులు ఖాళీ
- పట్టణ ప్రాంతాలకు తరలిన ఉపాధ్యాయులు
- వెనుకబడిన మండలాలకు వెళ్లేందుకు వెనుకంజ
- మారుమూల మండలాల్లో అనేకం ఏకోపాధ్యాయ పాఠశాలలే..
- పాఠశాలల్లో టీచర్ల కొరతపై విద్యాశాఖకు ఎంఈవోల నివేదిక
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5000 మందికి స్థానచలం

గుంటూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బదిలీలతో ఇక ఉపాధ్యాయులకు కొరత ఉండదు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇక ఇబ్బందులు ఉండవు. అన్ని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు సంపూర్ణంగా ఉంటారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం.. అని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అవాంతరాలు.. ఆందోళనలతో ఎట్టకేలకు గతవారంలో ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి చేశారు. సోమవారం నుంచి పాఠశాలల్లో ఆయా ఉపాధ్యాయులు చేరుతారు.. బోధనకు ఇబ్బందులు ఉండవని విద్యాశాఖ అధికారులు తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. బదిలీలతో పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మారుమూల మండలాల్లోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా పోయారు. అసలే ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు పడుతున్న ఆయా పాఠశాలలు బదిలీల కారణంగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోనున్నాయి. బాపట్ల, పల్నాడు జిల్లాలో అనేక మండలాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీల్లో దాదాపు 5000 మందికిపైగా ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది వీరిలో అత్యధికమంది పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని వివిధ మండలాల నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రమైన గుంటూరు, ఆ సమీప పట్టణ ప్రాంతాలకు బదిలీ చేసుకున్నారు. ప్రధానంగా పల్నాడులో వెనకబడిన ప్రాంతాలైన బొల్లాపల్లి, వెల్దుర్తి, ఈపూరు, దాచేపల్లి, మాచవరం, వినుకొండ రూరల్ తదితర మండలాల నుంచి ఎక్కువ మంది ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాలకు బదిలీ (మిగతా 8వ పేజీలో)



పల్నాడులోని ఓ పాఠశాలలో ఒకే టీచర్ బోధన

జగన్ ప్రతి అడుగు కుట్ర రాజకీయాల్లో భాగమే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జగన్ వేస్తున్న ప్రతి అడుగు కుట్ర రాజకీయాల్లో భాగమేనని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్‌పై ఉన్న వెర్రి అభిమానంతో రెంటపాళ్లకు చెందిన నాగమల్లేశ్వరరావు అప్పులుచేసి గత ఎన్నికల వేళ వైసీపీ గెలుపుపై భారీస్థాయిలో పందేలు కాసాడని వివరించారు. ఫలితాలు వెలువడ్డాక వైసీపీ ఓటమిని చూసి తట్టుకోలేక, అవమానభారంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. ప్రజల నాడిని పసిగట్టలేని జగన్ పిచ్చి ఆలోచనలకు అన్యాయంగా నాగమల్లేశ్వరరావు బలైపోయాడని, గత ఏడాది జూన్ 9న నాగమల్లేశ్వరరావు చనిపోతే, జగన్ కు ఇప్పుడు ఆయన కుటుంబాన్ని పరామర్శించాలనే ఆలోచన రావడం సిగ్గుచేటని విమర్శించారు. నాగమల్లేశ్వరరావుపై వైసీపీ ప్రభుత్వంలోనే రెండుకేసులు నమోదయ్యాయని తెలిపారు. నాగమల్లేశ్వరరావు చనిపోయింది జూన్ 9న అయితే, కూటమిప్రభుత్వం ఏర్పడింది జూన్ 12న అని పేర్కొన్నారు. అలాంటప్పుడు అతని చావుకు, కూటమిప్రభుత్వం ఎలా కారణం అవుతాయో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. నాగమల్లేశ్వరరావు కుటుంబంపై జగన్ కు అంతటి ప్రేమాభిమానాలే ఉంటే అతని అప్పులు తీర్చి, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలన్న ఆలోచన ఎందుకు చేయడని ప్రశ్నించారు. సత్తెనపల్లి పర్యటనలో పోలీసుల ఆంక్షలు, సూచనల్ని పెడచెవిన పెట్టిన జగన్ నిర్లక్ష్యం, వైసీపీనేతల విచ్చలవిడి ప్రవర్తనే వెంగళాయపాలెం వాసి సింగయ్య, మరోవ్యక్తి మరణానికి కారణం అని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

శవాలతో రాజకీయ పునాది రాళ్లు

❖ జగన్‌పై ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం

మాచర్లటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శవాలతో రాజకీయ పునాది రాళ్లు వేసుకున్న నీచుడు జగన్‌రెడ్డి అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గం, రెంటపాళ్ల గ్రామంలో జగన్ పర్యటనపై బుధవారం జూలకంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో జగన్‌రెడ్డి లాంటి సైకో రాజకీయ వేత్త మరొకరు ఉండరని మండిపడ్డారు. గతేడాది జగన్ మోసపూరిత మాటలు నమ్మి ఎన్నికల్లో వైసీపీ గెలుస్తోందని రూ. కోట్లలో బెట్టింగ్ కాసి అప్పులై ఆత్మహత్య చేసుకున్న నాయకుడు నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని ఇప్పుడు పరామర్శించడమేంటని ప్రశ్నించారు. సోషల్ మీడియా ప్రచార పిచ్చితో కన్నూ మిన్నూ కానక కారుతో గుద్ది దళితుడిని పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు ప్రజలకు ఏం చేశావని ప్రజలకు నీ సిగ్గులేని మొహం చూపించడానికి వచ్చావని విమర్శించారు. ఇప్పటికైనా మీ కారు టైరు కింద నలిగిపోయిన దళిత వృద్ధుడు సింగయ్య కుటుంబానికి క్షమాపణ చెప్పి శవ రాజకీయాలు మానుకోవాలని జగన్ పల్నాడు పర్యటనను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి హితవు చెప్పారు.

జగన్.. నేరపూరిత రాజకీయాలకు శ్రీకారం

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నేర ప్రవృత్తి కలిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నేరపూరిత రాజకీయాలకు శ్రీకారం చుట్టారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. పల్నాడు జిల్లా పర్యటన పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి అలజడి సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కుట్ర రాజకీయం, విద్వేష రాజకీయమే జగన్ మోహన్‌రెడ్డి రాజకీయ నైజం అన్నారు. పల్నాడు ప్రజలు ఓడించి గుణపాఠం చెప్పినా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలో మార్పులేదన్నారు. అభివృద్ధి చెందుతున్న పల్నాడు ప్రాంతంలో వైసీపీ విషరాజకీయాలకు శ్రీకారం చుట్టిందని, వైసీపీ చర్యలను ఆ పార్టీ నేతలు తీరును పల్నాడు ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నోటి వెంట వచ్చేవి అన్ని అసత్యాలు, అబద్ధాలు తప్ప మరొకటి కాదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని, సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచి పనులు చూసి జగన్‌మోహన్‌రెడ్డి ఓర్వలేకపోతున్నారని, చంద్రబాబునాయుడుకు వస్తున్న ఆదరణ తట్టుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

పల్నాడు జిల్లాలో చిచ్చు కోసమే పర్యటన : ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో చిచ్చు రేపటం కోసమే మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటనకు వచ్చారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం తెలిపారు. పోలీసులు వంద మందికి అనుమతిస్తే వైసీపీ నేతలు వేలాది మందిని సమీకరించి బల ప్రదర్శన చేశారన్నారు. ఇద్దరు అమాయకుల మరణం జగన్, వైసీపీ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం అన్నారు. జగన్ ఒకరిని పరామర్శించటానికి వచ్చి మరో ఇద్దరి మరణానికి కారణమయ్యారని, జగన్ కారణంగా నష్ట పోయిన వ్యక్తి మరణాన్ని టీడీపీకి ఆ పాదించాలని చూడటం దారుణమన్నారు. జరిగిన విషాదంపై స్పందించ కుండా జగన్ పర్యటన కొనసాగించటం మరో దుర్మార్గం అన్నారు. ఇద్దరి మృతికి కారణమైన ఘటనలో బాధ్యులైన వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వ్యవసాయ సిబ్బంది అవినీతి ఆరోపణలపై విచారణ

❖ ఒక ఎంపీఈవో సరెండర్, ముగ్గురికి షోకాజ్ నోటీసులు ❖ ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన




శావల్యాపురంలో సిబ్బందిని విచారిస్తున్న ఏడీఏ రవిబాబు

శావల్యాపురం,జూన్18(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ చేసినందుకు రైతుసేవాకేంద్రాల్లోని సిబ్బంది రైతుల వద్ద నగదు వసూలు చేశారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ప్రచురించిన ఈకేవైసీకి..రూ.500 అన్న కథనానికి స్పందించిన జిల్లా వ్యవసాయశాఖాధికారి ఆదేశాలతో వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు శావల్యాపురం రైతుసేవాకేంద్రంలో ఫిర్యాదుదారులను విచారించారు. వెలమావారిపాలెం రైతులు వేల్పూరు-2 ఎంపీఈవో హరిబాబు నగదు వసూలు చేశాడని చెప్పడంతో స్పందించిన ఏడీఏ రవిబాబు ఎంపీఈవో హరిబాబును జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయానికి సరెండర్ చేశారు. కారుమంచి వీహెచ్ఏకి, కొత్తలూరు, పోట్లూరు ఎంపీఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ రైతుల వద్ద నగదు వసూలు చేసినట్లుగా సిబ్బందిపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని, వాటిని డీఏవోకి పంపి ఆయన ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకొంటామని తెలిపారు. వేల్పూరు ఎంపీఈవోపై గతంలో కూడా తమకు ఫిర్యాదులువచ్చాయని, విచారణలో రుజువు కావడంతో సరెండర్ చేశామన్నారు. విచారణ జరుగుతున్న సమయంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి విధి నిర్వహణలో ఇటువంటి ఆరోపణలు రావడం సహజమని, సిబ్బంది ఎవ్వరూ దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించడం గమనార్హం. మతుకుమల్లి రైతుసేవాకేంద్రం గత కొంతకాలంగా మూసి వీఏఏ సచివాలయంలో విధులు నిర్వహిస్తుందన్న ఆరోపణలపై ఏడీఏ స్పందించలేదు. ఏడీఏతో పాటు ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

తమిళనాడు యువకుడి సైకిల్ యాత్ర

నేపాల్, బంగ్లాదేశ్ యాత్ర పూర్తి



పిడుగురాళ్లలో పర్యావరణ ప్రేమికుడు ముత్తా సెల్వన్‌ను అభినందిస్తున్న కూటమి నేతలు

పిడుగురాళ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరుకు చెందిన ముత్తా సెల్వన్ ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా సైకిల్ యాత్ర చేపట్టి బుధవారం పిడుగురాళ్లకు చేరుకున్న సెల్వన్‌ను ఆంధ్రజ్యోతి పలకరించింది. ఈ సందర్భంగా సెల్వన్ మాట్లాడుతూ 2021 డిసెంబరు 21న తమిళనాడులో సైకిల్‌యాత్రగా బయలుదేరి ఇప్పటికి నేపాల్, బంగ్లాదేశ్‌లో సైకిల్ యాత్ర పూర్తయి ఇండియాలో ఇప్పటికి 28వ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుండా వెళ్తున్నానని సెల్వన్ వివరించాడు. ఇప్పటికి 38,781 కిలోమీటర్లు సైకిల్ యాత్ర ద్వారా ప్రయాణిస్తూ దారిపొడవున గ్రామాలు, పట్టణాలలో ప్రజలకు పర్యావరణం, మొక్కల పెంపకంపై ఆవశ్యకతను వివరిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు నడుం బిగిస్తే భావితరాల వారు ఆరోగ్యంగా వుంటారన్న లక్ష్యంతో ఈ యాత్ర చేపట్టినట్లు సెల్వన్ వివరించాడు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద సెల్వన్‌ను పాండురంగ శ్రీను, డాక్టర్ పున్నం నాగమల్లికార్జునరావు, వడ్డవల్లి సాంబశివరావు, పణితి రవి, పిల్లి చెన్నారావు, జొన్నలగడ్డ శ్రీను, ఏఎంసి చైర్మన్ వీరస్వామి, కామిశెట్టి రమేష్, నెకరికంటి శివ, వర్ల రత్నం, వడ్లమూడి వెంకయ్య, రమేష్ తదితరులు అభినందించారు.

చివరి దశకు టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు మరమ్మతులు : ఎస్ఈ



టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో జరుగుతున్న మరమ్మతులు

రెంటచింతల,జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో చేపట్టిన మరమ్మతు పనులు చివరి దశకు చేరినట్లు ఎస్ఈ కే వెంకటరమణ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెండు టర్బయిన్ల పని తీరును పరిశీలించామన్నారు. అలాగే 20 రేడి యల్ క్రస్ట్ గేట్ల పనితీరును పరిశీలించే నిమిత్తం ట్రయల్ రన్ నిర్వహించామన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి 78 ఎంయూల విద్యుత్ తయారు చేయాలనేది లక్ష్యం కాగా 92.4279 ఎంయూల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి టార్గెట్‌ను అధిగమించామన్నారు.. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7 టీఎంసీలకు గాను 6.990 టీఎంసీల నీరుందన్నారు. ఈయన వెంట ఈఈ సుబ్రహ్మణ్యం,నాగరాజు, సుబ్బారావు తదితరులున్నారు.

మహిళా బిల్లులో ఓబీసీ మహిళల సబ్ కోటా తేల్చాలి

● కేసన శంకరరావు

గుంటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళల సబ్- కోటా ఎంతో కేంద్ర ప్రభుత్వం ముందే తేల్చాలంటూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు బుధవారం ఒక ప్రకట నలో డిమాండ్ చేశారు. 2023లో 128వ రాజ్యాంగ సవరణ చేసి, 33 శాతం చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చే లా కేంద్రం చట్టం చేయడం సంతోషదాయకమేనన్నారు. కానీ భారతీయ సమాజంలో ఎస్సీఎస్టీ మహిళల వలే, ఓబీసీ మహిళలు కూడా పెత్తందారీ వర్గాల మహిళలతో ఏమాత్రం చట్ట సభల ఎన్నికలలో పోటీ పడలేకపోతున్నా రని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న మహిళా రిజర్వే షన్ చట్టాన్ని యథతథంగా అమలు జరిపితే, ఆధిపత్య వర్గా ల మహిళలతోనే పార్లమెంటు నూరు శాతం నిండిపోతుందన్నారు. అన్ని రంగాలలో అన్ని విధాల వెనుకబడి ఉన్న అణగారిన వర్గాలకు చెందిన ఓబీసీ మహిళలకు,మహిళా రిజర్వేషన్లలో సబ్ కోటాను దేశవ్యాప్తంగా ఓబీసీ సంఘాలు అందుకే కోరుతున్నాయన్నారు. 2027 డిసెంబరు చివరికల్లా జనగణనతో పాటు సమగ్ర కులగణన కూడా పూర్తవుతున్నందున, ఆపై దేశవ్యాప్తంగా పార్లమెంటు, వివిధ రాష్ట్రాల శాసనసభల నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. 2029 ఎన్నికలలో మహిళా రిజర్వేషన్లు అమలయ్యే లోపే, చట్టసభలలో మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని సవరించి, ఓబీసీ మహిళకు సబ్-కోటా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ బిల్లుల బకాయిలపై ఫోకస్...

● వైసీపీ హయాంలో భారీగా బకాయిలు

● మాజీ ఎమ్మెల్యే ముద్దాళిగిరికి ఫారం బీ నోటీసులు

గుంటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖకు బకాయిలు గుదిబండలా మారాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బకాయిలు కొండ్ర రెట్టింపవటం సీపీడీసీఎల్ సంస్థను మరింత నష్టాల్లోకి తీసుకెళు తోంది. దాంతో ఇటీవల ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్‌లు జిల్లాల పర్యటనలో భాగంగా ఇటీవల గుంటూరులో పర్యటించారు. అధికారులతో అంతర్గత సమావేశం నిర్వహించిన వారు బకాయిలపై మరింత దృష్టి పెట్టాలని స్పష్ట మైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో గుంటూరు సర్కిల్ అధికారులు బకాయిలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆయా బిల్లుల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం చూపటంతోనే బిల్లులు రూ.వందల కోట్లకు చేరుకున్నాయని విద్యుత్‌శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క గుంటూరు సర్కిల్ పరిధిలో చూస్తే రూ.కోట్లలో బకాయిల రూపంలో గుదిబండగా మారాయి. భారీగా పేరుకుపోయిన బకాయిలు డిస్కంపై పెను భారంగా మారింది. ఇప్పటికే నష్టాలతో కొట్టుమిట్టాడుతోన్న సీపీడీసీఎల్‌కు కేవలం ఎల్‌టీ (లో టెన్షన్) కేటగిరీ లో మాత్రమే కోట్లు బకాయిలు పేరుకుపోగా హెచ్‌టీ (హై టెన్షన్) అదనంగా బకాయిలున్నట్లు సమాచారం.

మాజీ ఎమ్మెల్యే ముద్దాళిగిరికి చెందిన స్పిన్నింగ్ మిల్స్‌కు బకాయిలు రూ.42 కోట్లకు పైనే పేరుకుపోవటం ఇటీవల సంచలనంగా మారింది. తెనాలి డివిజన్ పరిధిలోనున్న ఈ స్పిన్నింగ్ మిల్స్‌కు సంబంధించి బకాయిలు రాబట్టేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే గిరికి ఫారం బీ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. కాగా తెనాలి డివిజన్‌లలోనున్న వేరొకరికి చెందిన స్పిన్నింగ్ మిల్లుకు కూడా రూ.9 కోట్లకు పైనే బకాయిలుండటంపై నోటీసులు జారీ చేసి ఇటీవల విద్యుత్ సరఫరా కూడా నిలిపివేసినట్లు ఆ శాఖా వర్గాలు తెలిపాయి.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 20.91 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 514.10 అడుగులు ఉంది. ఇది 138.73 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

పల్నాడులో జగన్ యాత్ర.. జనానికి మరణయాత్ర

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో జగన్ మరలా అధికారంలోకి వస్తారని చెప్పి బెట్టింగులు పెట్టి నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న వైసీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శ పేరుతో యాత్ర నిర్వహించటం పల్నాడులో జనానికి మరణయాత్రగా వుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో ఎద్దేవా చేశారు. రోడ్ షోల పేరుతో అరాచకానికి, విధ్వంసానికి సత్తెనపల్లి నియోజకవర్గంలో జగన్ యాత్రే నిదర్శనమన్నారు. పరామర్శల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ పోలీసులు ఇచ్చిన అనుమతులను దుర్వినియోగం చేసి రోడ్‌షోల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని యరపతినేని ప్రశ్నించారు. రెంటపాళ్ల పర్యటనలో ఏటుకూరు బైపాస్ వద్ద హైవేపై నడుచుకుంటూ వెళ్తున్న సింగయ్య అనే వృద్ధుడిని జగన్ కాన్వాయ్ వాహనం వేగంగా ఢీకొట్టడం వల్ల వృద్ధుడు రోడ్డుపక్కన పడిపోయినా పట్టించుకోకుండా అక్కడ వదేసి వెళ్లిపోయారని, ఆ తరువాత ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో కూడా వైసీపీ నేతల రోడ్‌షో, బైకుల బీభత్సం, వెకిలి చేష్టలకు ఓ వ్యక్తి మృతి చెందినప్పటికీ పార్టీ నేతలు ఎవరూ పరామర్శించకుండానే వెళ్లిపోవడాన్ని పల్నాడు ప్రజలు జగన్ యాత్రను జనం మరణయాత్రగా భావిస్తున్నారన్నారు. రోజుకొక వైసీపీ నాయకుడు లిక్కర్ మాఫియా కేసుల్లో అరెస్టు అవుతున్నారని, ల్యాండ్ మాఫియా మరికొన్ని కేసుల్లోనూ అరెస్టు అయి జైలుకు వెళ్తుంటే ఆ విషయాన్ని డైవర్ట్ చేసేందుకే జగన్ పరామర్శల పేరుతో యాత్ర చేపట్టాడన్నారు. పోలీసులు చెప్పినా వినకుండా జగన్ భద్రతా చర్యలను పూర్తిగా గాలికొదిలేసి విచక్షణ మరిచి ఇద్దరు ప్రాణాలను బలిగొన్నందుకు జగన్‌పై కేసులు పెట్టి కఠినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్ఆర్ఎం మహిళా రన్నర్లకు స్వర్ణ పతకాలు



ఆర్ స్వాతి, కే రంజిత, ఎం శిరీష

మంగళగిరి సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మహిళా రన్నర్లు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. 400, 200 మీటర్ల పరుగు పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి మొత్తం నాలుగు పతకాలను దక్కించుకున్నారు. ఇటీవల అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించిన కుంజా రంజిత 400 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, మరో అథ్లెట్ రొంగాలి స్వాతి 200, 400 మీటర్ల పోటీల్లో స్వర్ణం, రజత పతకాలు, ముక్త శిరీష 400 మీటర్ల పోటీలో కాంస్య పతకం సాధించారు. రాష్ట్రస్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రన్నర్లు వరుసగా నాలుగు పతకాలను సాధించడం విశేషం. పతకాలు సాధించిన రజిత, స్వాతి, శిరీషలను యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పీ సత్యనారాయణ అభినందించారు.

కోదాడ నుంచి దాచేపల్లికి తెలంగాణ బస్సులు

ప్రారంభించిన ఆర్టీసీ అధికారులు



కోదాడ నుంచి దాచేపల్లికి ప్రయాణిస్తున్న ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు

దాచేపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆర్టీసీకి చెందిన బస్సులు కోదాడ నుంచి దాచేపల్లి నుంచి పిడుగురాళ్ళ వరకు రాకపోకలు నిర్వహించేందుకు బుధవారం ప్రారంభించారు. కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి మీదుగా దాచేపల్లికి చేరుకొని పిడుగు రాళ్ళ వరకు బస్సు సర్వీసులను కొనసాగిస్తారు. ఎంతో కాలం నుంచి ఈ ప్రాంతం నుంచి ఎదురు చూస్తున్న పల్నాడు ప్రాంత ప్రజలకు కోదాడకు రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. ఇక్కడి నుంచి రాష్ట్రంలోనే అతి పెద్ద పశువుల సంతగా పేరు గాంచిన కోదాడ పశువుల సంతకు, అదేవిధంగా శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి వారి దేవస్థానమైన పెనుగంచిప్రోలు, వేదాద్రి వంటి పుణ్య క్షేత్రాలకు రాకపోకలకు పల్నాడు ప్రాంత ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. తెలంగాణ ఆర్టీసీ ఇప్పటికే దాచేపల్లి నుంచి మిర్యాలగూడకు సర్వీసు లు నడుపుతూ ప్రజలకు సేవలు అందిస్తుంది. ఇప్పుడు కోదాడ నుంచి కూడా నడపటం పట్ల ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాల తనిఖీకి ఎనిమిది బృందాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం అయ్యింది.'విత్తనాల విపణిలో జిల్లాకు నకిలీ మరకలు' అనే శీర్షికతో ఈ నెల 14వ తేదీన 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి ఈ చర్యలు చేపట్టారు. జిల్లాలో ఉన్న విత్తనాల కంపెనీలు, షాపులు తనిఖీ చేసేందుకు ఏడీఏ, ఏఓలతో ఎనిమిది బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా వ్యవసాయ అధికారి యూ నరసింహారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బృందాలు గురువారం, శుక్రవా రం జిల్లాలో విస్తృతంగా పర్యటించి తనిఖీలు చేపడతారు.

రైల్వే ట్రాక్ మరమ్మతులు

తెనాలి అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అంగలకుదురు-కొలకలూరు మార్గంలో రైల్వే ట్రాక్ మరమ్మతులు కారణంగా రెండు రోజుల పాటు ట్రాఫిక్ నిలిపి వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 228 రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు వద్ద మరమ్మతుల కారనంగా గేటు 19వ తేదీ కూడా మూసి వేసి ఉంటుందని ప్రయాణికులు ఆ మార్గంలో ప్రయాణించరాదని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

55,658 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 56,758 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 55,658 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,690 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11400
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13200	334	9800	13500
273	10000	12400	నెంబరు. 5	10000	13300
341	10000	13500	273	—	—
4884	—	—	341	10000	13700
సూపర్ 10	—	—	సూపర్ 10	10000	12400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000	తేజ	10000	14300
షార్క్-1	—	—	బ్యాడిగి	10000	13300
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13500
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు

• బాపట్ల • వేమూరు • రేపల్లె



రైతులకు సబ్సిడీ యంత్రపరికరాలు అందజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, పర్చూరు, బాపట్ల ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ తదితరులు

రైతులకు రాయితీతో యంత్ర పరికరాలు

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రాయితీ సొమ్మును బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావులతో కలిసి రైతులకు మెగా చెక్ ద్వారా అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 5 సంవత్సరాలలో రాయితీపై పనిముట్లు పొందని రైతులకు రాష్ట్రప్రభుత్వం స్టేట్ ఫామ్ మెకనైజేషన్, అగ్రికల్చర్ మెకనైజేషన్ కింద మంజూరు చేసిందన్నారు. కర్షక పోర్టల్ ఆధారంగా లబ్ధిదారులను సాంకేతికంగా ప్రభుత్వ వివరాలను వినియోగించి పారదర్శకంగా ఎంపిక చేసి యంత్రాలను అందజేయటం జరిగిందన్నారు. 557 మందికి ట్రాక్టర్లతో నడిచే యంత్ర పరికరాలు, 42 మందికి రోటావేటర్లు, 51 మందికి బ్యాటరీ స్ప్రేయర్లు, 374 మందికి పవర్ స్ప్రేయర్లు, ఐదుగురికి ట్రాక్టర్ స్ప్రేయర్లు, 3 పవర్ వీడర్లు, నలుగురికి బ్రెష్ కట్టర్‌లు, ఐదుగురికి పవర్‌టిల్లర్‌లు రైతు కేంద్రాల ద్వారా అందజేయటం జరుగుతుందన్నారు. 1,061 మంది రైతులకు సంబంధించి 50 శాతం రాయితీ మొత్తం 2,10,02,358 రూపాయలను రైతులకు అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం రైతులకు తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావు, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, ఏడీఏ ఎ.లక్ష్మీ, వ్యవసాయాధికారిణి కె.శారద పాల్గొన్నారు.

ఒత్తిడి నియంత్రణకు యోగా దోహదం

● ఎస్పీ తుషార్ డూడి

● జిల్లా పోలీసు కార్యాలయంలో యోగా సాధన

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు యోగాసాధన ఎంతగానో దోహదపడుతుందని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు పేరెడ్‌గ్రౌండ్‌లో యోగాసాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువులు ధూళిపాళ్ళ శైలజ పాల్గొని 32 రకాల యోగాసనాలతోపాటు సూర్య నమస్కారాలను పోలీసులతో సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజన్‌ల పరిధిలోని పోలీసు అధికారులు, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు. యోగా ద్వారా శారీరక మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చు అని ఎస్పీ తెలిపారు. పోలీసు విధులలో పని ఒత్తిడి అధికంగా ఉండే నేపథ్యంలో యోగా ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మౌలుద్దీన్, ఆర్ఎస్ఐ కళ్యాణ్, యోగా మాస్టర్ ట్రైనర్ గురజాల శ్రీనివాసరావు, కర్పూరపు మంజులత, కృష్ణారావు, ఎం.సూరిబాబు, బాజి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న పోలీసు సిబ్బంది

పదివేలమందితో యోగా కార్యక్రమం : కలెక్టర్

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యలంక సముద్రతీరంలో ఈనెల 21వ తేదీన 10వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన సూర్యలంకబీచ్‌లో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. యోగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, సమగ్రశిక్ష ఏపీడీ నాగిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమా తదితరులు పాల్గొన్నారు.



సూర్యలంక సముద్రతీరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు

● సమగ్రశిక్ష ఏపీసీ నాగిరెడ్డి

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రశిక్ష పరిధిలోని ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదలైనట్లు అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగిరెడ్డి తెలిపారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థన, పరస్పర అంగీకార బదిలీలకు మాత్రమే అవకాశాలు కల్పించారన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది, సీఆర్ఎంటీ, మండల స్థాయి అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మేసెంజర్‌లు, ఆఫీస్ సబార్డినేటర్లు, సైట్ ఇంజనీర్లు బదిలీల కొరకు ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. సీనియార్టీ జాబితా 24వ తేదీన ప్రకటించి అభ్యంతరాలకు 27వ తేదీ వరకు అవకాశం కల్పించటం జరుగుతుందన్నారు. 28వ తేదీన తుది జాబితా ప్రకటిస్తారన్నారు. సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ జరిపి ఈనెల 30నుంచి జూలై 2వ తేదీ లోపు బదిలీ ఉత్తర్వులు ఇస్తారన్నారు. అంతర్ జిల్లాల బదిలీలు కోరుకునేవారు రెండురోజుల్లోపు దరఖాస్తులను సంబంధితాధికారి ధ్రువీకరణతో సమగ్రశిక్ష బాపట్ల జిల్లా కార్యాలయానికి పంపితే వాటిని రాష్ట్ర సంచాలకులకు పంపుతామని నాగిరెడ్డి తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల నివారణే ప్రధాన లక్ష్యంగా ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాల మేరకు పట్టణ పోలీసులు బుధవారం రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రైళ్లల్లో ఈగల్ టీమ్ సభ్యులతో కలిసి పట్టణ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. బిలాస్పూర్-తిరుపతి ట్రైన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడ ఎటువంటి మాదకద్రవ్యాలు కనిపించకపోవటంతో ప్లాట్‌ఫారంపై ప్రయాణికుల బ్యాగ్‌లను, సూట్ కేసులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మనోజ్‌కుమార్, జీఆర్‌పీ ఎస్ఐ సరస్వతి, పోలీసు సిబ్బంది, డ్వాగ్ స్క్వాడ్ పాల్గొన్నారు.



రైలులో ప్రయాణికుల బ్యాగ్‌లు తనిఖీ చేస్తున్న పోలీసులు

విస్తృతంగా వాహనాల...

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సీఐ ఆర్.రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. చీలురోడ్డు సెంటర్, పాత బస్టాండ్, గడియారస్తంభం సెంటర్ పరిసర ప్రాంతాలలో వాహనాలను తనిఖీ చేశారు. మాదకద్రవ్యాలకు సంబంధించి, ఇతర కార్యక్రమాలకు సంబంధించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు విక్రయాలు వేగవంతం చేయాలి

● కలెక్టర్‌లను ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ బర్లీ పొగాకు విక్రయాలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశానికి బాపట్ల నుంచి కలెక్టర్ జె.వెంకటమురళి హాజరయ్యారు. జిల్లాలో బర్లీ పొగాకు పండించిన ప్రతి రైతు దగ్గర నుంచి చివరి ఆకు వరకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రైతుల దగ్గర నుంచి పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా, ప్రైవేట్ కంపెనీల ద్వారా కొనుగోలు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 15 మిలియన్ టన్నుల బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పొగాకు కొనుగోలుపై సీఎం యాప్‌లో రైతుల పేర్లను వ్యవసాయ శాఖ సిబ్బందిచే నమోదు చేయించాలన్నారు. రైతులు పండించిన బ్లాక్‌బర్లీ పొగాకు నాణ్యతను బట్టి హెచ్‌డీఆర్, హెడ్‌డీఎం పొగాకు రకానికి కిలో రూ.120, హెచ్‌డీఎక్స్ రకానికి కిలో రూ.60 చొప్పున ధర నిర్ణయించటమైనదని తెలిపారు. పొగాకు కొనుగోలు చేసి ఏ రోజుకు ఆ రోజు వివరాలను తెలియజేయాలని ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్‌లను ముఖ్యమంత్రి ఆదేశించారు.

బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలుకు సంబంధించి వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహిస్తున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి ముఖ్యమంత్రికి వివరించారు. బాపట్ల, పర్చూరు ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ,ఏలూరి సాంబశివరావులతో కలిసి నిర్వహించే సమావేశంలో పర్చూరులో రెండు, చీరాలో ఒకటి చొప్పున పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటమైనదని వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మొదటి దశలో 14,800మెట్రిక్‌టన్నుల బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవటమైనదన్నారు. ఈనెల 19వ తేది నుండి కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వీడియోకాన్ఫరెన్స్‌లో వివరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఈవీఎం గోదాం పరిశీలించిన కలెక్టర్

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డులోని ఈవీఎం గోదాంను కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. త్రైమాసిక సాధారణ పరిశీలనలో భాగంగా ఈవీఎం గోదామును ఆయన తనిఖీ చేశారు. గోదాములో నియోజకవర్గాల వారీగా ఈవీఎం, వీవీ ఫాట్స్ యంత్రాలను భద్రపరిచిన తీరును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లపై ఆయన ఆరా తీశారు. పోలీసుల భద్రత, సందర్శన దస్త్రాన్ని పరిశీలించారు. పోలీసుల నిరంతర నిఘా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, బీజేపీ నాయకులు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు దోనేపూడి రవికుమార్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుడే రాజారావు, సీపీఎం నాయకుడు కె.శరత్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఆట్ల బాలాజిరెడ్డి, వైసీపీ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, తహసీల్దార్ షేక్ సలీమా, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫి పాల్గొన్నారు.



ప్రసవం చేయించుకున్న మహిళకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలు సాయి ఆరోగ్య మల్టీస్పెషాలిటీ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో అత్యంత వైద్యపరికరాల హంగులతో ఏర్పాటు చేసిన హాస్పటల్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. వైద్యశాలలో ప్రసవం చేయించుకున్న మహిళలకు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, నిర్వాహకులు మంతెన కరుణ రాజు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరామర్శతో ప్రాణాలు బలిగొనటం దారుణం : కొల్లా

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రెంటపాళ్ళ పరామర్శ యాత్ర భయోత్పాతాలు సృష్టిస్తూ రెండు నిండు ప్రాణాలు బలిగొనటం దారుణమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ జగన్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని సింగయ్య అనే రైతు మరణించగా వైసీపీ కార్యకర్త జయవర్ధనరెడ్డి కూడా గందరగోళంలో స్పృహతప్పి ఆసుపత్రిలో చేరి అశువులు బాయటం జరిగిందన్నారు. జగన్ పరామర్శల పేరుతో మోగిస్తున్న మరణమృదంగాలకు ఇది నిదర్శనమన్నారు.

రైల్వేట్రాక్ పరిసరాలలో పశువులు రాకుండా చూడాలి

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రైల్వే సరిహద్దులో కాని, రైల్వే ట్రాక్ దగ్గర కాని పశువులను మేపట నేరమని రైల్వే అధికారులు తెలియజేశారు. ఈవిషయమై బుధవారం పట్టణంలోని చిల్లరగొల్లపాలెం, చాకలిపాలెం, రైలుపేట, ఉప్పరపాలెం తదితర ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ పశువుల యాజమానులు, కాపలాదారులు ఎవరైన అతిక్రమించి పశువులను తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏడీఈఎన్ కాటూరి శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మనోజ్‌కుమార్‌రెడ్డి, సాయిరవితేజ, బత్తులసాయి చరణ్, ఎఎస్సై ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారులకు సైబర్ నేరగాళ్ళ ఫోన్‌కాల్

● కర్లపాలెం పోలీసులను ఆశ్రయించిన అధికారులు

కర్లపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని పలువురు అధికారులకు సైబర్ నేరగాళ్ళు ఎసీబీ డీఎస్పీ అంటూ ఫోన్‌కాల్స్ చేసి హడలెత్తించారు. వివరాల్లోకి వెళితే.. కర్లపాలెం ఎంపీడీవో శ్రీనివాసరావుకు సైబర్ నేరగాళ్ళు ఫోన్ చేసి నేను ఎసీబీ డీఎస్పీని అని, త్వరలో దాడులు చేయబోతున్నామని, మీ మండలంలో బాగా అవినీతి జరుగుతుందంటూ పలువివరాలు కావాలని బుధవారం ఫోన్ చేశారు. ఎంపీడీవోనే కాకుండా పలువురు పంచాయతీ కార్యదర్శులకు ఫోన్‌లు రావటంతో అధికారులంతా హడలిపోయారు. అప్రమత్తమైన ఎంపీడీవో శ్రీనివాసరావు సదరు విషయాన్ని కర్లపాలెం ఎస్ఐ రవీంద్రకు తెలియపర్చటంతో ఆయన ఎంపీడీవోకు వచ్చిన నెంబర్‌కు ఫోన్ చేయగా అవతలి వ్యక్తి ఫోన్ తీయలేదు. ఇది సైబర్ నేరగాళ్ళ పని అని ఫేక్‌కాల్స్ అని ఎస్ఐ, అధికారులు నిర్థారించుకున్నారు. ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ ఇలాంటి ఫోన్‌లు వచ్చినప్పుడు ప్రజలు, ఉద్యోగస్తులు ఎట్టి పరిస్థితులు వ్యక్తిగత వివరాలు తెలియజేయకూడదన్నారు. అనుమానం వస్తే వెంటనే కర్లపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, 9440900870 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నేడు శ్రీలింగోద్భవస్వామి షాపింగ్ కాంప్లెక్స్‌కు బహిరంగ వేలం

పిట్టలవానిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలులో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లో గల 8 షాపులకు గురువారం ఉదయం 11గంటల నుంచి దేవదాయశాఖాధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహించటం జరుగుతుందని త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ.5 వేలు దరవత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చునని చెప్పారు. షాపులకు సంబంధించి అద్దె ఒక సంవత్సరం ముందుగానే చెల్లించాలని అన్నారు.

మద్యం దుకాణాల బెల్ట్‌షాపు పాటలు

● హెచ్చరించిన కర్లపాలెం పోలీసులు

కర్లపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఎవరైనా మద్యం అక్రమంగా వినియోగించినట్లైతే కఠిన చర్యలు తప్పవని పెదపులుగువారిపాలెంలోని పలుషాపుల దుకాణ యజమానులను కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తన సిబ్బందితో కలిసి వారిని హెచ్చరించారు. మద్యం దుకాణాలకు బెల్ట్‌షాపుల పాట నిర్వహించారని సమాచారం తెలిసిన మీదట మద్యం షాపులు అక్రమంగా నిర్వహిస్తే చర్యలు తప్పవని పలు షాపుల వారిని హెచ్చరించామని తెలిపారు. ఈ విషయంపై కర్లపాలెం పోలీసులు అప్రమత్తమైనప్పటికీ సంబంధిత ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు మాత్రం తనకేమి సంబంధంలేనట్లుగా మిన్నకున్నారు.

మోదీ పాలనలో వెలిగిపోతున్న భారత్ : రాంపల్లి

నగరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనలో భారత్ వెలిగిపోతుందంటూ బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ రాంపల్లి జగన్నాథశాస్త్రి అన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 సంవత్సరాల సుపరిపాలన కార్యక్రమాన్ని రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలోని నగరం మండలంలోని జంగంలంకలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు జి.సురేష్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగన్నాథశాస్త్రి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు, రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ ఇంకొల్లు మాణిక్యరావు, రేపల్లె నియోజకవర్గ సహాయ ఇన్‌చార్జ్ బయ్యన్న వెంకట్రావులు నరేంద్రమోదీ పాలనలో దేశానికి, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందించి పథకాల గురించి వివరించారు. ఈ కారక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ రాంపల్లి జగన్నాథశాస్త్రి

కూలీలకొరత అధిగమించేందుకు కొత్త యంత్రాలు

చెరుకుపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కూలీల కొరత అధికంగా ఉందని పంజాబ్ మోడల్‌గా దక్షిణ భారతదేశంలో యంత్ర పరికరాలను సరికొత్తగా రూపొందించినట్లు జగజ్జీత్ ఇండస్ట్రీస్ ఎండీ ధర్మసింగ్ అన్నారు. బుధవారం బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం నడింపల్లికి వచ్చిన ఆయన ఔత్సాహిక రైతులతో సమావేశం నిర్వహించారు. రబీ, జొన్న, పచ్చజొన్న పంటలను హార్వెస్టింగ్ చేసేందుకు నూతన యంత్రపరికరాలను తమ సంస్థ తయారుచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ టెక్నికల్ ఇంజనీర్ పృథ్వీ సింగ్, కంపెనీ కో ఆర్డినేటర్ ఉదయశంకర్‌సింగ్, చెరుకుపల్లి హెడీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ సత్యదేవ్ ఔత్సాహిక రైతులు గోగినేని వెంకట సుబ్బారావు, డాక్టర్ కొడాలి మోహన్, డాక్టర్ కొడాలి కీర్తిచంద్ర, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా శంకర్ బాధ్యతలు స్వీకరణ

కొల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శిగా ఎం.శంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొల్లూరు పంచాయతీ కార్యదర్శిగా ఉన్న మల్లికార్జున చుండూరు మండలం అంబేద్కర్‌నగర్‌కు బదిలీ కాగా ఆ స్థానంలో కాకుమాను పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన శంకర్‌ను కొల్లూరుకు బదిలీ చేశారు. బుధవారం ఆయన స్థానిక పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టి సచివాలయ సిబ్బందితో చర్చించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఆయనను సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శంకర్

పచ్చిరొట్ట సాగుతో భూములు సారవంతం

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం వల్ల భూములు సారవంతం అవుతాయని డీపీటీఐ వాణిశ్రీ అన్నారు. భట్టిప్రోలులోని రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీపీటీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులకు పీఎండీఎస్ కిట్లు అందుబాటులో ఉన్నాయని వాటిలో 9 నుంచి 20 రకాల విత్తనాలు ఉంటాయని, వీటిని సాగు చేయడం ద్వారా భూమిలోని సూక్ష్మపోషకాలు మొక్కలకు లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో లక్ష్మీప్రసన్న, టి.అఖిల, విఏఏ మైత్రేయి, రైతులు రాంబాబు, ప్రసాద్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు, ఈపూరు గ్రామాల్లో...

కొల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు బుధవారం రెండు గ్రామాల్లో నిర్వహించారు. మండల కేంద్రం కొల్లూరు, మండల పరిధిలోని ఈపూరు గ్రామాల్లో ఏవో నరేంద్రబాబు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ కార్డులు గురించి కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొలం వివాదంలో ఘర్షణ

అమృతలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మూల్పూరులో పొలం వివాదంలో బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలికి చెందిన వేములపల్లి రజని, తన సోదరి కుమారుడు వెనిగళ్ళ సునీల్‌కుమార్‌ను వెంటబెట్టుకుని మూల్పూరులో తమకు చెందిన పొలంను దుక్కి దున్నేందుకు వెళ్లారు. ఇంతలో గ్రామానికి చెందిన యలవర్తి భూషయ్య, యలవర్తి శోభారాణి, మరికొంతమంది తమపై దాడి చేశారని తెనాలి వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న వైసీపీ నేతలు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి

రేపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తల్లికి వందనం సక్సెస్ అయ్యి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు రావటంతో తట్టుకోలేని వైసీపీ మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి ద్వారా జగన్‌రెడ్డి రూ.42లక్షలు విద్యార్థులకు ఇస్తే కూటమిప్రభుత్వం 67.2 లక్షల మందికి తల్లికివందనం లబ్ధిచేకూర్చిందన్నారు. విమర్శించటానికి ఏమీలేక రూ.13 వేలు విద్యార్థులకు, రూ.2 వేలు లోకేశ్ తీసుకున్నాడని కొంతమంది వైసీపీ నాయకులు పిచ్చిప్రేలాపనలు పేలుతున్నారని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి కింద రూ.13 వేలు ఇచ్చి రూ.2వేలు జగన్‌రెడ్డి జేబులో వేసుకున్నారా అని ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం ఇచ్చిన అరుహామీలు ఒక్కొక్క హామీని అమలు చేస్తూ ముందుకు వెళ్ళుతున్నారన్నారు. ఈ సమావేశంలో కృష్ణా పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, అనగాని శివప్రసాద్, వెంకట్ యాదవ్, జీవీనాగేశ్వరరావు, కొలసానిరాము, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటిశ్రీనివాసరావు

టీడీపీ సీనియర్ నాయకుడు సంగీతరావుకు నివాళి

కొల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో కన్నుమూసిన టీడీపీ సీనియర్ నాయకులు కనపర్తి సంగీతరావుకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నివాళులర్పించారు. మండల పరిధిలోని తాడిగిరిపాడు గ్రామానికి చెందిన సంగీతరావు అనారోగ్య సమస్యలతో మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆనందబాబు కొల్లూరు మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణతో కలిసి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంగీతరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, మురళీకృష్ణ

ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన మోటూరి

రేపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండి బంజరు భూములను పేదలకు పంపిణీ చేయాలని పెద్ద ఎత్తున పోరాటాలు చేసిన నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు మోటూరి హనుమంతరావు అని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. బుధవారం మోటూరు హనుమంతరావు 24వ వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కర్షక కుటుంబంలో జన్మించిన మోటూరు హనుమంతరావు అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు వై.కిషోర్, కె.ఆశీర్వాదం, డి.ఆగస్టిన్, కె.సాయిప్రసాద్, వెంకట్రావు, కె.రమేష్, ఈవూరి రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మోటూరి హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వెల్లటూరులో...

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ మాజీ సభ్యుడు, రేపల్లె తొలి శాసన సభ్యుడు, సీపీఎం నాయకుడు మోటూరి హనుమంతరావు 24వ వర్ధంతిని పార్టీ నాయకులు బుధవారం నిర్వహించారు. మండల పరిధిలోని వెల్లటూరులో హనుమంతరావు విగ్రహానికి ఆంధ్రా యూనివర్శిటీ విశ్రాంత ఉద్యోగి పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి, నాగమల్లేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్‌ను ఉరి తీసిన తరువాత బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో హనుమంతరావు ఆందోళన నిర్వహించారన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమర యోధుడు పమిడిముక్కల లక్ష్మణరావు స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.కృష్ణమోహన్, మురుగుడు సత్యనారాయణ, ఎ.రామస్వామి, వేములపల్లి వెంకట్రామయ్య, మణిలాల్, నాగరాజు, డి.సత్యనారాయణ, మనోజ్‌కుమార్, బి.ఆగస్టీన్, నాగమల్లేశ్వరరావు, బీఎల్‌కే ప్రసాద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా వెంకటరెడ్డియ్య

వేమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ విష్ణుమొలకల వెంకటరెడ్డియ్య వైసీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తన నియామకానికి కృషి చేసిన పార్టీ ఇన్‌చార్జి అశోక్‌బాబుకు వెంకటరెడ్డియ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎన్‌యూలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న వర్సిటీ ఉద్యోగులు, అధికారులు





జ్యోతి ప్రజ్వలన చేసి వర్సిటీలో యోగాంధ్రని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

దినచర్యలో యోగా.. భాగం కావాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

ఏఎన్‌యూలో ఘనంగా యోగాంధ్ర 2025

పెదకాకాని, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగాను దినచర్యలో భాగంగా చేసుకుంటే శారీరక, మానసిక, ఆరోగ్యపరమైన జీవన శైలి సాధ్యమౌతుందని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యోగాంధ్ర -2025 కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి, కృష్ణా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య రాంజీ, ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు, జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలసి ఆమె పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025 వేడుకలను జిల్లాలో అత్యంత ఘనంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యములో ఏర్పాటు చేయటమైనదన్నారు. యోగాపై అవగాహన కల్పించడానికి మాస్టర్ ట్రైనర్‌లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇది ఒక్క రోజులో చేసి వెళ్ళే కార్యక్రమం కాదని ఒక అలవాటుగా చేసుకుని నిరంతరం అభ్యసించేలా చేస్తున్నామన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, దాని అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎనిమిది వేల మందితో నాగార్జున యూనివర్సిటీ ప్రధాన క్రీడా మైదానంలో కోఆర్డినేటర్ ఎ. రాధిక యోగాసనాలు చేయించారు.

ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి రాష్ట్ర ఛైర్మన్ కె.మధుమూర్తి మాట్లాడుతూ జూన్ 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా డేలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొననున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రజలకు యోగా అనేది ఒక ప్రాచీనమైన శారీరక వ్యాయామము మాత్రమే కాకుండా మానసిక ఉత్తేజాన్ని కలిగించే కార్యక్రమంగా సందేశాన్ని అందించాలన్నారు. అనంతరం యోగా అభ్యాసకులు యోగా ప్రతిజ్ఞ, మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో యోగా నోడల్ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ గణేశ్‌కుమార్, యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య కే రత్నషీలామణి, రిజిస్ట్రార్ జీ సింహాచలం, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, యోగాంధ్ర నిర్వాహకులు ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, వసతి గృహాల వార్డెన్లు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య వీరయ్య, సురేశ్ కుమార్, సిద్ధయ్య, రవి శంకర్ రెడ్డి, కో ఆర్డినేటర్‌లు, విభాగాధిపతులు, పరిశోధకులు యోగా అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా.. యోగాంధ్ర

❖ పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ❖ ధ్యానబుద్ధ చెంత యోగాసనాలు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి) ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా సీఎం చంద్రబాబు రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అందులో భాగంగా పల్నాడు జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచిన అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద వేలాది మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్ అధికారులు, స్థానిక పాఠశాలల విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు, ఉపాధి హామీ కూలీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. యోగాచార్యులు ఆనందరామ్, జే శ్రీనివాస్, సుజాత, గురవయ్యలు యోగాసనాలను వేయిస్తూ వాటివలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ నిత్యం ఉద్యోగరీత్యా, కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉండే తరుణంలో ఇలాంటి కార్యక్రమం మనస్సుకు ఆనందాన్ని, ఉల్లాసాన్ని కలుగజేస్తుందన్నారు. కృష్ణానది తీరాన, ధ్యానబుద్ధుని చెంత ఉదయం ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. జిల్లాలోని కొండవీడుకోట, కోటప్పకొండ, అనుపు, అమరావతిలో ఈ యోగాంధ్ర కార్యక్రమాలు చేయడం జరిగిందని, 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరు యోగా చేయాలని పిలుపునిచ్చారు. చివరిగా యోగా గురువులను సన్మానించడము జరిగింది. కార్యక్రమంలో నృత్యప్రదర్శన చేసిన చిన్నారులను కలెక్టర్ అభినందించి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఈ మురళీ, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణీ, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, డీఈఓ చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవి, డీపీఓ వెంకటేశ్వరనాయక్, డీఎల్‌డీవో రాజగోపాల్, ఆర్‌డీఓ రమణాకాంత్ రెడ్డి, టూరిజం డీవీఎం చైతన్య జిల్లా టూరిజం అధికారి జీ నాయుడమ్మ, ఎంపీపీ హనుమంతరావు, సర్పంచ్ పావనీ, మండల స్థాయి అధికారులు రాజగోపాల్, పార్వతీ, తహశీల్దార్ దానియేలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



యోగాంధ్రలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

సీఆర్డీఏలో జాబ్ మేళా

ఉద్యోగాలు పొందిన 110 మంది అభ్యర్థులు

తుళ్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి (ఏపీసీఆర్డీఏ) సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణాశాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో బుధవారం జాబ్ మేళా జరిగింది. ఈ మేళాలో ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఆటో మొబైల్, ఫైనాన్స్, స్కిల్ డెవలప్‌మెంటు రంగాలకు చెందిన 5 ప్రముఖ కంపెనీలైన వరుణ్ మోటార్స్, స్కిల్ క్రాఫ్ట్‌లిమిటెడ్, ఎంవీఆర్ ఇన్ఫ్రా ప్రాజెక్టు లిమిటెడ్, కేఎంవీ ప్రాజెక్టు లిమిటెడ్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. 409కి పైగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ జాబ్ మేళా నిర్వహించగా 806 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. జాబ్ మేళాకు 264 మంది అభ్యర్థులు హాజరు కాగా పలువురు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. జాబ్ మేళాలో 110 మంది ఆఫర్ లెటర్‌లు అందుకోగా 137 మంది అభ్యర్థులు తదుపరి రౌండ్లకు ఎంపికయ్యారు. రాజధాని అమరావతిలో పర్యటిస్తున్న ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు బృందం సైతం సీఆర్డీఏ స్కిల్ హబ్‌లో జరుగుతున్న జాబ్ మేళాను పరిశీలించారు. అభ్యర్థులతో మాట్లాడి ఇంటర్వ్యూలు జరుగుతున్న తీరును పరిశీలించారు. సీఆర్డీఏ ఆధ్వర్యంలో తుళ్లూరులోని స్కిల్ హబ్ ద్వారా అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను, రాజధాని యువత, మహిళలకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను అధికారులు వారికి వివరించారు. ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య శిక్షణ అధికారి అరుణ కుమారి జాబ్ మేళా సమన్వయ బాధ్యతలను నిర్వర్తించారు. అలాగే ఎస్‌పీసీ అసిస్టెంట్ డైరెక్టర్ వీ నరసింహారావు, సీఆర్డీఏ డీసీడీఓ టీ శ్రీనివాసరావు, సీనియర్ లైవ్ లీహుడ్ ఆఫీసర్ శంకర్ తదితరులు పాల్గొని జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించారు. జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక సిబ్బందిని నియమించి రిజిస్ట్రేషన్, ఇంటర్వ్యూల నిర్వహణ ప్రక్రియ సాఫీగా నిర్వహించారు.



జాబ్ మేళాలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

రూ. 3 కోట్లు.. కమీషన్

● జగనన్న కాలనీ భూముల వ్యవహారంలో నేతల వాటా

● భూముల కొనుగోలుపై విజిలెన్స్ విచారణ

● ఎకరాకు రూ.5లక్షలు ఇచ్చామంటున్న రైతులు



ఇసుకపల్లిలోని 18వ వార్డు జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన గృహాలు

రేపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అక్రమార్జనే ధ్యేయంగా ప్రతిపనిలోను కమీషన్‌ల రూపంలో అడ్డగోలుగా దోచుకుని కోట్లాది రూపాయలు రైతులకు చెందాల్సిన నగదును అప్పటి వైసీపీ నాయకులు దౌర్జన్యంగా దోచుకుతిన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టటంతో జగనన్నకాలనీల ఏర్పాటులో భూముల కొనుగోలులో విచారణ ప్రారంభించారు. రేపల్లె పురపాలకసంఘ పరిధి ఇసుకపల్లిలోని 18వ వార్డులో వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల కోసం రైతుల వద్ద నుంచి 66ఎకరాల భూమిని సేకరించారు. ఈ భూములు కొనుగోలు విషయంలో ప్రభుత్వానికి, రైతులకు మధ్య వైసీపీ నాయకులు మధ్యవర్తిత్వం చేసి ఎకరాకు లక్షల రూపాయలు కమీషన్‌ల రూపంలో దోచేశారు. దీనికి తోడుగా అప్పటి రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సహాయసహకారాలు అందించటంతో యథేచ్ఛగా రైతులకు చెందాల్సిన సొమ్ము వైసీపీ నాయకుల జేబుల్లోకి వెళ్ళింది. అప్పట్లోనే కొంతమంది రైతులు కమీషన్లు ఎందుకు ఇవ్వాలంటూ బాహాటంగానే వాదించినా వైసీపీ ప్రభుత్వ పెద్దలు బెదిరింపులకు గురిచెయ్యటంతో చేసేదిలేక నోరుమూసుకుని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఐదురోజుల కిందట జగనన్నకాలనీ భూముల కొనుగోలుపై రైతులను విజిలెన్స్ అధికారులు రహస్యం గా విచారించారు. విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఎకరా రూ.44లక్షలకు కొనుగోలు చేసిన అప్పటి ప్రభుత్వం రైతుల వద్ద నుంచి రూ.5లక్షలు వైసీపీ నాయకులు తీసుకున్నారని బాహాటంగానే రైతులు విజిలెన్స్ విచారణలో తెలిపారు. దీంతో విజిలెన్స్ అధికారులు భూ ములు ఇచ్చిన రైతుల స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకున్నారు. ప్రభుత్వం ప్రతి రైతుకు ఎకరాకు రూ.43, 44లక్షలు వారిఖాతాల్లో జమ చేయగా వెంటనే వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు వారివద్ద నుంచి ఎకరాకు రూ.5లక్షలు చొప్పున కమీషన్లు తీసుకున్నారని విచారణలో తెలిపినట్లు రైతులు వివరించారు. 66ఎకరాలకు రూ.5లక్షల చొప్పున 3.30 కోట్ల రూపాయలు అప్పటి నేతలు, అధికారులు కుమ్మక్కై దోచుకున్నారంటూ రైతులు వాపోతున్నారు.

ఉపాధ్యాయులు ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

అయ్యారు. అదే స్థాయిలో వెనుకబడిన మండలాలకు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడానికి సుముఖత చూపలేదు. దీంతో ఆయా పాఠశాలల్లో భారీ సంఖ్యలో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ఇప్పటికే విద్యాశాఖకు నివేదిక అందజేశారు.

రిలీవ్ కాకుండా ఏర్పాట్లు చేసినా..

పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోని మండలాల్లో బదిలీ అయినా కొన్ని రోజులు అక్కడే విధులు నిర్వహించాలని విద్యాశాఖ మౌఖికంగా ఉపాధ్యాయులను ఆదేశించింది. ఆయా ఉపాధ్యాయులు తమకున్న సెలవుల్ని వాడుకుంటూ బదిలీ అయిన ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏం చేయాలో పాలు పోక విద్యాశాఖ అధికారులు మదన పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులు బోధించాల్సి వస్తోంది. మరికొన్ని పాఠశాలల్లో సీఆర్పీలతో నెట్టుకు రావాలని అధికారులు ప్రయత్నిస్తున్నా వీలు కావడం లేదని సమాచారం.

కొత్త డీఎస్సీ వస్తేనే భర్తీ..

ప్రభుత్వం ఇప్పటికే మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలు నిర్వహిస్తోంది. త్వరలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ తదితర విభాగాల్లో దాదాపు వెయ్యికి పైగా పోస్టులు రానున్నట్లు విద్యాశాఖ వర్గాలు అంచనా. ఈ పోస్టులను ప్రధానంగా బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మారుమూల పాఠశాలలకు కేటాయించాలని ఆలోచిస్తున్నారు.

రైలుకిందపడి ఆత్మహత్యాయత్నం

తల్లి, సంవత్సరం కుమార్తె మృతి.. ఆరేళ్ల కుమారుడు క్షేమం

తెనాలి మారీస్‌పేట, జూన్ 18, (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలో, లేక మరే కష్టమొచ్చిందో కానీ ఇద్దరు చిన్న పిల్లలతో సహా రైలులో ప్రయాణిస్తూ మార్గం మధ్యలోనే దిగేసి మరో రైలుకింద తన ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడిందో బీహార్‌కు చెందిన ఒక మహిళ. తాను, సంవత్సరం కుమార్తెతో సహా మరణిస్తే, చివరి క్షణంలో ఏమని ఆలోచించిందో కానీ ఆరేళ్ల కుమారుడిని మాత్రం పక్కకు నెట్టేయటంతో ఆ బాలుడు మాత్రం ప్రాణాలతో బయటపడ్డాడు. రైల్వే ఎస్ఐ సరస్వతి చెప్పిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రంలోని సీతామర్హి జిల్లా బైర్గానియాలోని బింగాహి గ్రామానికి చెందిన పూనందేవి(30) తన ఇద్దరు పిల్లలతో తిరువనంతపురం-నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ, చుండూరు మండలం మోదుకూరు రైల్వే గేటు దగ్గర సిగ్నల్ కోసం రైలు ఆగటంతో అక్కడ దిగేసింది. పక్కనే రైల్వే పనులు చేస్తున్న కూలీల దగ్గర కూర్చుని, వారి దగ్గరే భోజనం కూడా చేసి కూర్చున్న ఆమె ఒక్కసారిగా బుధవారం సాయంత్రం 4.40 గంటల సమయంలో అటుగా మరో రైలు వస్తున్న విషయం తెలుసుకుని ఒక్కసారిగా తన పిల్లలతో సహా ఆ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. తనతోపాటు తన సంవత్సరం వయసున్న చిన్నారిని పట్టుకుని ఉండటం, ఆరేళ్ల కుమారుడు సునీల్‌ను పక్కకు నెట్టేయటంతో తల్లి, కుమార్తె మరణించారు. కుమారుడు మాత్రం ప్రాణాలతో బయటపడ్డాడు. సంఘటన జరిగిన ప్రదేశం చూస్తే హృదయం ద్రవించేలా ఉంది. నెలల చిన్నారి ముక్కలయి విగతజీవిగా పడిఉండటంతో చూసిన వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రాంతం వారు కాకున్నా, వారెవరో తెలియకున్నా సంఘటన జరిగిన తీరు చూసి చలించిపోయారు. ప్రాణాలతో బయటపడిన సునీల్ అనే బాలుడిని మాత్రం తెనాలి రైల్వే పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి చిన్నారుల వసతి గృహానికి అప్పగిస్తున్నామని ఆమె చెప్పారు. ఐతే సంఘటన జరిగిన ప్రదేశంలో రైల్వే పనులు చేస్తున్న కూలీలను విచారిస్తే... తన భర్త తాగొచ్చి రోజూ కొడుతుంటాడని, బాధ తట్టుకోలేక ఇంటినుంచి వచ్చేశానని చెప్పిందని వారు వివరించారని తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని, బీహార్‌లో ఆమె జిల్లాలోని పోలీసులకు సమాచారం అందించామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



తెనాలి రైల్వే స్టేషన్‌లో పోలీసుల దగ్గర దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆరేళ్ల బాలుడు

బర్లీ పొగాకు.. రైతుకు ఊరట

(5వ పేజీ తరువాయి)

నేరుగా ప్రభుత్వమే రంగంలోకి దిగింది. కొనుగోళ్ల కోసం నేరుగా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇంతటితో సరిపెట్ట కుండా కొనుగోళ్ల కోసం రూ.300 కోట్ల ప్రత్యేక కేటాయించేలా కేంద్ర పెద్దలను ఒప్పించింది. రాష్ట్రంలోనే కాదు, దేశచరిత్రలోనే పొగాకు కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగడం ఇదే తొలిసారి అని పలువురు చెప్తున్నారు. దీంతో నాలుగు జిల్లాల పరిధిలో ఏడు కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ కొనుగోళ్లను ప్రారంభించనున్నది. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారం భించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బర్లీ పొగాకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

రెండే గ్రేడ్లు..

గ్రేడ్ల పేరిట రైతులను ఇబ్బంది పెట్టకుండా రెండు గ్రేడ్లుగానే కొనుగోలు చేయాలనే మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. హెచ్‌డీఎం రకానికి క్వింటా ధర రూ.12,000, హెచ్‌డీఎక్స్ రకానికి క్వింటా రూ.6,000గా ప్రభుత్వం ధర నిర్ణయించింది. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 4 లక్షల క్వింటాళ్ల వరకు బర్లీ నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా జరిపిన పరిశీలనలో తేలింది. ఇందులో ఒక్క బాపట్ల జిల్లా వాటానే దాదాపు 2.80 లక్షల క్వింటాళ్లుగా ఉండడం గమనార్హం. నాలుగు జిల్లాల పరిధిలో 15 కొనుగోలు కేంద్రాలు తెరవాలనే సూత్రప్రాయ నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఇందులో ఒక్క బాపట్ల జిల్లాలనే ఏడు కాగా మిగిలినవి ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో గురువారం బాపట్ల జిల్లాలో మూడు, ప్రకాశం జిల్లాలో ఒకటి, పల్నాడు జిల్లాలో రెండు, గుంటూరు జిల్లాలో ఒకటి చొప్పున కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.

తొలి దశలో 15 మిలియన్ల టన్నులు

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. బర్లీ పొగాకు చివరి ఆకు వరకు రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. తొలి దశలో 15 మిలియన్ల టన్నులను సేకరించాలని, ఆ తర్వాత దశల వారీగా పెంచుకుంటూ పోవాలని సూచించారు. పొగాకు కొనుగోలు చేయడానికి సీఎం యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

మహిళల భద్రతలో రాజీలేని పోరాటం

జాతీయ మహిళా కమిషన్ మెంబర్ అర్చన మజుందార్

గుంటూరు సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, రక్షణ, సంరక్షణ, హక్కుల పరిరక్షణతో పాటు, దాడులకు గురైన బాధిత మహిళలకు న్యాయం అందించి, వారికి పునరావాసం కల్పించేలా జాతీయ మహిళా కమిషన్ రాజీ లేకుండా కృషి చేస్తుందని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్ అన్నారు. బుధవారం గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజతో కలసి మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమంలో మహిళలు అందించిన ఫిర్యాదులపై విచారణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గత సంవత్సరంన్నర కాలంగా వివిధ జిల్లాల నుంచి అందిన ఫిర్యాదులలో లోక్ అదాలత్ తరహా మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమం ద్వారా 2024-25 సంవత్సరానికి సంబంధించి 60 ఫిర్యాదులను, విచారణ చేయటం జరుగుతుందన్నారు. కమిషన్‌కు వచ్చిన ఫిర్యాదులలో ఎక్కువగా గృహహింస, సైబర్ నేరాలు, వరకట్న మరణాలు, లైంగికదాడులు, హత్యలు, హత్యాచారయత్నాలు, హత్యాయత్నాలు తదితర కేసులు ఉన్నాయన్నారు. అదేవిధంగా పోలీసుల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని, విచారణ ఆలస్యం అవుతుందని, నిందితు లను అరెస్ట్ చేయటం లేదని, సరియైన సెక్షన్లు నమోదు చేయటం లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇటువంటి ఫిర్యాదులను నిబంధనల మేరకు విచారించి కమిషన్‌కు ఉన్న జ్యూడీషియల్ అధికారాల మేరకు చర్యలు తీసుకొని పోలీసులకు అవసరమైన ఆదేశాలను జారీ చేయటం జరుగుతుందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో రాజధానికి భూములు ఇచ్చిన మహిళా రైతుల ఆత్మగౌరవం కించపరిచేలా అనేక సంఘటనలు జరుగుతున్నాయని పలువురు మహిళా రైతులు కమిషన్ కు ఫిర్యాదు చేస్తూ కన్నీరు పెట్టుకున్నారన్నారు. ఇటువంటి సంఘటనలపై రాజీ లేకుండా కమిషన్ తీవ్రంగా స్పందిస్తుందని, దీనిని జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ దృష్టికి, సంబంధిత మంత్రిత్వ శాఖల దృష్టికి తీసుకువెళ్ళి నిందితులకు సరైన జడ్జిమెంట్ ఇచ్చేలా పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలలో అమరావతి మహిళలపై జరిగిన దాడులపై అప్పుడే జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించటం జరిగిందని, అప్పుడు కమిషన్ నుంచి వచ్చిన అధికారులు సక్రమంగా విచారణ చేయలేదన్నారు. గతంలో కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులను రీ ఓపెన్ చేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజధాని ప్రాంత మహిళా రైతులు, అమరావతి మహిళలపై చేసిన అవమానకరమైన, అభ్యంతకరమైన వాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. జిల్లా పరిషత్‌కు విచ్చేసిన జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందాకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, రాష్ట్ర మహిళా, మిషన్ శక్తి అసిస్టెంట్ డైరెక్టర్ ఏఎల్ఆర్ కుమారి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జ్ఞాన ప్రసూన, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు చెన్నయ్య, రాష్ట్ర మహిళా కమిషన్ లీగల్ కౌన్సిలర్ పూజిత, ఒన్ స్టాప్ సెంటరు లీగల్ కౌన్సిలర్ విజయలక్ష్మీ, న్యాయసేవాధికార సంస్థ తరుపున కట్టా కాళిదాసు, పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జాతీయ మహిళా కమిషన్ మెంబర్ అర్చన మజుందార్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తదితరులు

బర్లీ పొగాకు రైతుకు ఊరట

(5వ పేజీ తరువాయి)

నేరుగా ప్రభుత్వమే రంగంలోకి దిగింది. కొనుగోళ్ల కోసం నేరుగా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇంతటితో సరిపెట్టకుండా కొనుగోళ్ల కోసం రూ.300 కోట్ల ప్రత్యేక కేటాయించేలా కేంద్ర పెద్దలను ఒప్పించింది. రాష్ట్రంలోనే కాదు, దేశచరిత్రలోనే పొగాకు కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగడం ఇదే తొలిసారి అని పలువురు చెప్తున్నారు. దీంతో నాలుగు జిల్లాల పరిధిలో ఏడు కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ కొనుగోళ్లను ప్రారంభించనున్నది. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బర్లీ పొగాకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

రెండే గ్రేడ్లు..

గ్రేడ్ల పేరిట రైతులను ఇబ్బంది పెట్టకుండా రెండు గ్రేడ్లుగానే కొనుగోలు చేయాలనే మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. హెచ్‌డీఎం రకానికి క్వింటా ధర రూ.12,000, హెచ్‌డీఎక్స్ రకానికి క్వింటా రూ.6,000గా ప్రభుత్వం ధర నిర్ణయించింది. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 4 లక్షల క్వింటాళ్ల వరకు బర్లీ నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా జరిపిన పరిశీలనతో తేలింది. ఇందులో ఒక్క బాపట్ల జిల్లా వాటానే దాదాపు 2.80 లక్షల క్వింటాళ్లుగా ఉండడం గమనార్హం. నాలుగు జిల్లాల పరిధిలో 15 కొనుగోలు కేంద్రాలు తెరవాలనే సూత్రప్రాయ నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఇందులో ఒక్క బాపట్ల జిల్లాలనే ఏడు కాగా మిగిలినవి ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో గురువారం బాపట్ల జిల్లాలో మూడు, ప్రకాశం జిల్లాలో ఒకటి, పల్నాడు జిల్లాలో రెండు, గుంటూరు జిల్లాలో ఒకటి చొప్పున కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.

తొలి దశలో 15 మిలియన్ల టన్నులు

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. బర్లీ పొగాకు చివరి ఆకు వరకు రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. తొలి దశలో 15 మిలియన్ల టన్నులను సేకరించాలని, ఆ తర్వాత దశల వారీగా పెంచుకుంటూ పోవాలని సూచించారు. పొగాకు కొనుగోలు చేయడానికి సీఎం యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

ఉపాధ్యాయులు ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

అయ్యారు. అదే స్థాయిలో వెనుకబడిన మండలాలకు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడానికి సుముఖత చూపలేదు. దీంతో ఆయా పాఠశాలల్లో భారీ సంఖ్యలో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ఇప్పటికే విద్యాశాఖకు నివేదిక అందజేశారు.

రిలీవ్ కాకుండా ఏర్పాట్లు చేసినా..

పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోని మండలాల్లో బదిలీ అయినా కొన్ని రోజులు అక్కడే విధులు నిర్వహించాలని విద్యాశాఖ మౌఖికంగా ఉపాధ్యాయులను ఆదేశించింది. ఆయా ఉపాధ్యాయులు తమకున్న సెలవుల్ని వాడుకుంటూ బదిలీ అయిన ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏం చేయాలో పాలు పోక విద్యాశాఖ అధికారులు మదన పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులు బోధించాల్సి వస్తోంది. మరికొన్ని పాఠశాలల్లో సీఆర్పీలతో నెట్టుకు రావాలని అధికారులు ప్రయత్నిస్తున్నా వీలు కావడం లేదని సమాచారం.

కొత్త డీఎస్సీ వస్తేనే భర్తీ..

ప్రభుత్వం ఇప్పటికే మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలు నిర్వహిస్తోంది. త్వరలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ తదితర విభాగాల్లో దాదాపు వెయ్యికి పైగా పోస్టులు రానున్నట్లు విద్యాశాఖ వర్గాలు అంచనా. ఈ పోస్టులను ప్రధానంగా బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మారుమూల పాఠశాలలకు కేటాయించాలని ఆలోచిస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బర్లీ పొగాకు కొనుగోలు చరిత్రాత్మకం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రజాకూటమి ప్రభుత్వం లక్ష్యమని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. వేల ఎకరాల్లో సాగుచేసుకున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ముందుకు రావడం చరిత్మాక అంశమన్నారు. బుధవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసి నేడు ప్రారంభించనున్న నల్లబర్లీ పొగాకు కేంద్ర ప్రాంగణాన్ని, గోడౌన్లను ఎమ్మెల్యే ఏలూరి మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, వ్యవసాయ అధికారులు, రైతుల నేతృత్వంలో పరిశీలించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లబర్లీ రైతులను ఆదుకొని న్యాయం చేసేందుకు కొనుగోలుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ప్రస్తుతం రూ.300 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. అవసరమైతే మరో రూ.వెయ్యి కోట్లు కూడా కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండు గ్రేడ్‌ల ద్వారా నాణ్యమైన పొగాకు క్వింటా రూ.12000, లోగ్రేడ్ పొగాకు రూ.6000 చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. ఇప్పటికే రైతుల వివరాలను వ్యవసాయశాఖ ద్వారా సేకరించినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏడీఏ ఎస్.మోహనరావు, ఏవోలు రామమోహనెడ్డి, భాస్కర్‌రావు, నాయకులు వెంకట్రావు, నాయుడు హనుమంతురావు, షంషుద్దీన్, ఏజీపీ నరేంద్రకుమార్, కారుమంచి కృష్ణ, కొల్లా శ్రీనివాసరావు, పోట్రు శోభన్, రాముడు, వెంకటేశ్వర్లు, శివరాంప్రసాద్, పోపూరి శ్రీనివాసరావు, పఠాన్ సమీర్ పాల్గొన్నారు.



మార్క్‌ఫెడ్ డీఎంను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు ఏఎంసీని పరిశీలించిన కలెక్టర్

పర్చూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ వెంకటమురళీ, మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) జిలానీ సామూన్, వ్యవసాయ, రెవెన్యూశాఖ అధ్వర్యంలో పరిశీలించారు. నేడు బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. నాణ్యమైన పొగాకు క్వింటా రూ.12వేలు, లోగ్రేడ్ పొగాకు క్వింటా రూ.6వేల చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో గ్లోరియా, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏడీఏ ఎస్.మోహనరావు, ఆయా శాఖల అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, మార్క్‌ఫెడ్ ఎండీ జిలానీ సామూన్, ఆర్డీవో గ్లోరియా

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మార్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధిత చట్టంపై వైద్యాధికారులు, స్వచ్ఛంద సంస్థలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ పరిధిలో ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు 44, ప్రభుత్వ వైద్యశాలల్లో ఐదు ఉన్నాయన్నారు. డివిజన్ పరిధిలో ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉందన్నారు. వెయ్యి మంది మగ పిల్లలకుగాను 981 మంది ఆడపిల్లలు ఉన్నారన్నారు.

ఈ నిష్పత్తి అంతరాన్ని తగ్గించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.పద్మావతి, టౌన్ ఎస్పై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ శ్రావణితేజ, డాక్టర్ శివారెడ్డి, మదర్స్ ఇండియా సంస్థ సెక్రటరీ జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్ద దోర్నాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ చెప్పారు. మండలంలోని నల్లగుంట్ల, లకచెర్ల గిరిజన గ్రామాల్లో ధర్తి ఆబ జన్ భగీదరి అభియాన్ కార్యక్రమంపై బుధవారం చెంచు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంటు డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్ మాట్లాడుతూ 17 మంత్రిత్వ శాఖల ద్వారా ప్రవేశపెట్టిన పథకాల్లో భాగంగా ప్రతి ఒక్కరికీ పక్కాగృహం, ఇంటింటికీ కొళాయి ద్వారా తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణం, రేషన్‌కార్డుల మంజూరు, ఉజ్వల గ్యాస్ సిలిండర్, ఆధార్ కార్డు అందజేత వంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత అధికారులకు సహకరించి అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఏవో జవహర్‌లాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు శివకోటేశ్వరరావు, రంగయ్య, ఏఈవో చైతన్యకుమార్, టీఏ షేక్ లాల్ అహ్మద్, హౌసింగ్ ఏఈ సోమశంకర్, గిరిజన నాయకులు మంతయ్య, వీఆర్‌వో చెన్నయ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ : ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను చెంచు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రగొండపాలెం తహసీల్దారు డి. మంజునాథరెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని గుర్రపుశాల, చెర్లేతాండా, వేగినాటి కోటయ్య నగర్ కాలనీలలో ధర్తి ఆబ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ఆయా గూడాలలో చెంచు కుటుంబాలను గుర్తించి వారికి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, సిబ్బంది, చెంచులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టడవిని తలపిస్తున్న పోలీసు క్వార్టర్స్

అద్దంకిలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం

రెండు దశాబ్దాల క్రితం శిథిలావస్థకు

అద్దంకి, జూన్18(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో సుమారు 4 దశాబ్దాల క్రితం పోలీస్ క్వార్టర్స్ నిర్మించారు. అయితే రెండు దశాబ్దాల క్రితం నుండి భవనాలు శిథిలావస్థకు చేరడం ప్రారంభమయ్యాయి. సుమారు 15 సంవత్సరాల క్రితం పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో పూర్తిగా మూసివేసి సుమారు 7 సంవత్సరాల క్రితం శిథిలమైన భవనాలను భవనాలను తొలగించారు. అద్దంకి పట్టణంలో ఎన్టీఆర్ నగర్ వద్ద నామ్‌రోడ్డు వెంబడి సుమారు 2.50 ఎకరాల విస్తీర్ణంలో పోలీస్ క్వార్టర్స్ స్థలం ఉంది. అయితే కొద్ది భాగంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. మిగిలిన స్థలంలో చెట్లు పెరిగి చిట్టడవిని తలపించేలా మారింది. దీంతో విషసర్పాలు చేరే ప్రమాదం ఉందని సమీప గృహాల ప్రజలు కూడా భయపడుతున్నారు. పోలీసు క్వార్టర్స్ లేకపోవడంతో పోలీస్ అధికారులు, సిబ్బంది నివాసానికి ఇబ్బంది పడుతున్నారు. అద్దంకి పట్టణంలో ఇళ్లఅద్దెలు ఎక్కువగా ఉండడం సిబ్బందికి మరింత భారంగా మారింది. అధికారులు, సిబ్బంది బదిలీలు జరిగినప్పుడల్లా అద్దె ఇళ్ల కోసం వేట సాగించాల్సిన పరిస్థితి. అద్దంకి పట్టణంలో త్వరలో డీఎస్పీ కార్యాలయం కూడా ఏర్పాటు చేసే అవకాశం కూడా ఉండడంతో పోలీస్ క్వార్టర్స్ నిర్మాణంపై ప్రజా ప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



పోలీస్ క్వార్టర్స్ స్థలం లో దట్టంగా పెరిగి ఉన్న చిల్లచెట్లు

క్వార్టర్స్ స్థలంలో పెరిగిన వేపచెట్లు



బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన

నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో ప్రసన్నలక్ష్మి

ఒంగోలురూరల్ జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం గుండాయపాలెం గ్రామానికి తూర్పున గల బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్నలు బుధవారం స్థల పరిశీలన చేశారు. గుండాయపాలెం గ్రామ మత్స్యకారులు గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులకు బకింగ్‌హాం కాలువపై ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని వినతిపత్రాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వంతెన కోసం నిధులు మంజూరు చేయటానికి ప్రతిపాదనలు తయారుచేయటానికి జేసీ, ఆర్డీవో, ఇంజనీరింగ్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించారు. గుండాయపాలెం సమీపంలోని షిప్ ల్యాండింగ్ కేంద్రం నుంచి అధికారులు గుండ్లకమ్మ సముద్రంలో కలిసే ప్రదేశానికి బోటుపై ప్రయాణించారు. గుండ్లకమ్మ నుంచి పోయే బకింగ్‌హాం కాలువను కూడా పరిశీలించారు. అక్కడ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ నాయబ్ రసూల్, డీటీ అశోక్, ఆర్ఐ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.



బోటుపై సముద్రంలోకి ప్రయాణిస్తున్న జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో ప్రసన్నలక్ష్మి

బూత్‌లెవల్ ఏజెంట్ల వివరాలు అందజేయాలి

అద్దంకి, జూన్18 (ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయపార్టీలు ఐచ్ఛికంగా ఆయా పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల వివరాలు అందజేయాలని అద్దంకి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతికుమారి అన్నారు. అద్దంకిలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధ వారం రాజకీయపార్టీల నాయకులతో ఈఆర్‌వో జ్యోతికుమారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం ఉన్నందున వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, సీపీఐ, సీపీఎం నేతలు కేఎల్‌డీ ప్రసాద్, తంగిరాల వెంకటేశ్వర్లు, అద్దంకి, పంగులూరు తహసీల్దార్లు శ్రీచరణ్, సింగారావు, ఎలక్షన్ డిటీ సుబ్రహ్మణ్యం డిప్యూటీ తహసీల్దార్లు రాఘవ, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న జ్యోతికుమారి

అవీఇవీ

వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటుపై తీర్మానాలు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సైదా



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సైదా

మార్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ఈ నెల 24న జరిగే జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో తీర్మానాలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా అన్నారు. మార్కాపురంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న ఒంగోలులో జరిగే జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఆమె పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలు సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు.అన్ని ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రెహనాబాబు, జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ షేక్ షంషీర్ అలీ, కార్యదర్శి మహబూబ్ అలి, మార్కాపురం టౌన్, మండల, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమాన్, వి.రమేష్, షేక్ హుసేన్, ఎస్.ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

మూడు రోజులుగా వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం

ఎండిపోతున్న పంటలు.. రైతుల ఆందోళన

లైన్‌మన్ పనితీరుపై తీవ్ర విమర్శలు



తాళ్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

తాళ్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడురోజులుగా తాళ్లూరు దక్షిణపొలాలకు వ్యవసాయ విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండు ముఖం పడుతున్నాయని పలువురు రైతులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. తాళ్లూరు లైన్‌మన్ బాబూరావు మూడురోజులుగా విద్యుత్ మరమ్మతులంటూ ఎల్‌సీలు తీసుకుని కోత విధిస్తున్నారన్నారు. గంటల కొద్దీ ఎల్‌సీ తీసుకోవడంతో వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం కలుగు తుందని వాపోయారు.సబ్ స్టేషన్ వద్దకు వచ్చి ప్రశ్నిస్తే లైన్‌మన్ ఎల్‌సీ తీసుకున్నాడని చెప్పారని, లైన్‌మన్‌కు ఫోన్ చేస్తే తీయకపోగా తమ పట్ల అవమర్యాదకరంగా మాట్లాడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భర్త రెండవ వివాహం చేసుకోవడంపై ఫిర్యాదు

అద్దంకి, జూన్18(ఆంధ్రజ్యోతి): భర్త రెండవ వివాహం చేసుకోవడంపై భార్య స్థానిక పోలీస్ స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. మండలంలోని ధర్మవరానికి చెందిన బండి బాలకోటయ్య రెండవ వివాహం చేసుకున్నాడు. దీంతో భార్య శ్రీహిత బుధవారం పోలీసులకు భర్త, కుటుంబసభ్యులు, బంధువులపై ఫిర్యా దు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి,జూన్18(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ టవర్ లైన్ పనుల కారణంగా గురువారం ఉదయం కొత్త దామావారిపాలెం, శింగరకొండరోడ్డు, పెద్ద మసీదు సెంటర్, భవానిసెంటర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ దామోదరం తెలిపారు.

సెప్టిక్‌ట్యాంకు నిండడంతో ప్రజలు అవస్థలు

ఇంకొల్లు,జూన్ 18,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని సెప్టిక్‌ట్యాంకు నిండి రోడ్డు మీద ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సెప్టిక్‌ట్యాంకు మ్యాన్‌హోల్ పైపులు దెబ్బతినడంతో సమస్య తలెత్తి మురుగునీరు అంతా బుధవారం ప్రధాన రహదారిపైకి చేరి ప్రవహించింది. దీంతో ఈ ప్రాంత మంతా దుర్గంధభరితంగా మారింది. సెప్టిక్‌ట్యాంకు పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టే విధంగా ఆర్టీసీ అధికారులు తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

వ్యక్తిపై మద్యంమత్తులో పలువురి దాడి

ఈపూరుపాలెం (చీరాల), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిపై పలువురు మద్యంమత్తులో దాడిచేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వల్లెపు గోపి తన భార్యకు అస్వస్థతగా ఉండడంతో శీతలపానియం తెచ్చేందుకు తెల్లవారుజామున దుకాణం వద్దకు వెళుతున్నాడు. అదే సమ యంలో హరీష్, తేజసాయి, కిరణ్, రవి మరొకరు శివాలయం సమీపంలో మద్యం సేవిస్తున్నారు. అయితే గోపీ తేజసాయికి పాతపరిచయం ఉంది. ఆ చనువుతో పిలిచారు. కానీ మద్యం సేవించి శృతిమించి తూలనాడారు. అలాగే అయనపై ఐదుగురు దాడికి పాల్పడ్డారు. బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందగా బాధితుడి ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

పండించిన పొగాకు మొత్తం కొనాలి

ఇంకొల్లు, జూన్ 18, (ఆంధ్రజ్యోతి) : పొగాకు పండించిన ప్రతిరైతు వద్ద నుండి ఎటువంటి నిబంధనలు లేకుండా పొగాకు కొనుగోలు చేయాలని రైతుసంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి నల్లపనేని రామారావు బుధవారం డిమాండ్ చేశారు. ఇంకొల్లులో పర్చూరు రోడ్డులోని మార్కెట్ యార్డు వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కాలయాపన లేకుండా వెంటనే పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, మాదాల అంజయ్య, భానుప్రసాద్, రంగారావు, వెంకట్రావు, సుబ్బరామయ్య, జాన్, రైతులు పాల్గొన్నారు.

జూలై 5న జాతీయ లోక్‌అదాలత్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో వచ్చేనెల 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి బుధవారం తెలిపారు. ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులందరూ సహకరించాలన్నారు. రాజీపడదగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారం చెల్లింపు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువురి ఆమోదంతో పరిష్కరిస్తారన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్నవారు ఉపయోగించుకొని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలని కోరారు. లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులలో తీర్పు అంతిమ తీర్పు అని అన్నారు. పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి కోరారు.

అవీ..ఇవీ..

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలి


విద్యార్థుల వివరాలు నమోదు చేసుకుంటున్న హెచ్ఎం

చినగంజాం, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రనగర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం షేక్.నాయుబ్‌రసూల్ అన్నారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ బుధవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరే బాలబాలికలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. నూతనంగా చేరే విద్యార్థుల వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ మస్తాన్‌రావు, ఉపాధ్యాయులు సిద్ధం నాగమల్లేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు స్టాప్ బోర్డుల ఏర్పాటు


భవనాసి చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లు

అద్దంకి, జూన్18 (ఆంధ్రజ్యోతి): నామ్ రోడ్డులో ప్రమాదాల నివారణకు పోలీస్, నామ్‌రోడ్డు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన నామ్ రోడ్డులో పెరిగిన ప్రమాదాలు కథనానికి పోలీసులు, నామ్‌రోడ్డు అధికారులు స్పందించారు. శింగరకొండ సమీపంలో భవనాసి చెరువు కట్ట వద్ద వేగనియంత్రణ కోసం స్టాపర్లను ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల వేగం కొంత మేర తగ్గింది. అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ వద్ద కూడా స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

పేరాల(చీరాల), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ జూలై 9న నిర్వహించు జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎం.వసంతరావు పిలుపునిచ్చారు. బుధవారం పేరాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్మికులంతా సంఘటితమై సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.బాబురావు, సుధాకర్, రామిరెడ్డి, నీలాంబరం, శివనాగరాజు, ఏసురత్నం, సులోచన, సంధ్య అరుణ, వెంకటేశ్వరమ్మ, పోతురాజు పాల్గొన్నారు.

శవాలకూ జాగారమే..!

- మార్చురీ కొరవడిన వసతులు
- మృతదేహాలను నిల్వ ఉంచేందుకు ఫ్రీజర్‌లు బాక్సులు కరువు

అద్దంకిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో మార్చురీ గదిలో వసతులు కొరవడ్డాయి. వివిధ సంస్థలు, దాతలు గతంలో ఆస్పత్రికి ఇచ్చిన ఫ్రీజర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఇక వైద్యశాలకు పోస్టుమార్టం కోసం వచ్చిన మృతదేహాన్ని పోస్టుమార్టం చేసేంత వరకు భద్రపరచడం ప్రహసనంగా మారింది. ప్రైవేటు వ్యక్తులు అద్దె ప్రాతిపదికన ఉన్న ఫ్రీజర్ల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఇక మార్చురీకి గుర్తు తెలియని మృతదేహాలను ఎవరివో కనుగొనేందుకు కనీసం మూడు రోజుల పాటు భద్రపరచాల్సి ఉంటుంది. ఇక్కడ ఫ్రీజర్లు లేకపోవడంతో ఇలాంటి మృతదేహాలను భద్రపరచడం వ్యయప్రయాసలతో ఇబ్బందులు తప్పడం లేదు. పోలీసులే నయానో భయానో ప్రైవేటు ఫ్రీజర్లల్లో ఉంచుతున్నారు. ఇక వైద్యశాలకు వచ్చే మృతదేహాలను ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న మార్చురీ బాక్సులలో పెట్టి వాటికి డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి వైద్యశాల వద్ద నెలకొంది.


మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న పాతఫ్రీజర్లు

వైద్యశాలకు ఒక వైపు జాతీయ రహదారి, మరొక వైపు రాష్ట్రీయ రహదారి ఉండడంతో ఏదో ఒకచోట తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. వీటితో పాటుగా అద్దంకి నియోజకవర్గంలోని వివిధ మండలాలలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరిగి ప్రతి రోజు పోస్టుమార్టం కోసం మృతదేహాలను అద్దంకి వైద్యశాలకు తీసుకొస్తుంటారు. ఈ క్రమంలో వైద్యశాలలో మృతదేహాలను భద్ర పరిచేందుకు ఫ్రీజర్‌బాక్సులు లేకపోవడంతో అద్దెబాక్సులే దిక్కయ్యాయి. దీంతో మృతుల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. గతంలో వైద్యశాలకు వివిధ సంస్థలు, దాతలు సమకూర్చిన ఫ్రీజర్లు మరమ్మతులకు గురికావడంతో వాటిని పక్కన పడేశారు. అయితే పలుమార్లు మరమ్మతులు చేయించిన అవి పని చేయడం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. దీంతో పోస్టుమార్టం కోసం వచ్చిన మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రైవేట్ వ్యక్తులకు చెందిన మార్చురీ బాక్సులను నగదు చెల్లించి నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం 30 పడకల వైద్యశాల కావడంతో మార్చురీలో కనీస వసతులు లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.



అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీ గది

వైద్యశాలను అప్‌గ్రేడ్ చేస్తేనే వైద్యశాలకు మరిన్ని వసతులు సమకూరతాయని పలువురు వైద్యాధికారులు అంటున్నారు. ఏదిఏమైనా మార్చురీ వద్ద ఫ్రీజర్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొత్తవాటి కోసం ప్రతిపాదన పెట్టాం

ఇప్పటికే నాలుగైదు పర్యాయాలు మరమ్మతులకు గురైతే బాగుచేయించాం. ప్రస్తుతం అవకాశం లేకపోవడతో పక్కన పెట్టాం. ప్రభుత్వానికి ఒక ఫ్రీజర్ కావాలని నవేదికను పంపించాం.

వాహిలా చౌదరి వైద్యశాల పర్యవేక్షణాధికారి

తూర్పు తక్కెళ్లపాడులో తాగునీటి కష్టాలు

పంగులూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామ ప్రజలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన (రక్షిత మంచినీటి పథకం) ఉనికిని కోల్పోయింది. గ్రామ ప్రజల నీటి అవసరాలు తీర్చాలన్న నాటి పాలకుల సంకల్పం, దాతల దాతృత్వం నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. ప్రజలకు రక్షిత నీటిని అందించాలని ఏర్పాటు చేసిన పైలెట్ ప్రాజెక్ట్ నిర్వహణ లోపంతో అటకెక్కింది. రక్షిత నీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలకు కనీసం తాగునీరైనా అందించాలన్న ఉద్దేశ్యంతో రక్షిత ట్యాంక్‌కు అనుసందానంగా ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.


మూతపడ్డ ఆర్‌వో ప్లాంట్

పదేళ్లగా ప్లాంటు ద్వారా నీటి సరఫరా

పైలెట్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో ప్రజల ముంగిటకు రక్షిత నీటిని సరఫరా చేసిన అధికారులు పైపులైన్‌లో తలెత్తిన లోపాలు, కొళాయిల వద్ద నెలకొన్న వివాదాలతో రక్షిత నీటి సరఫరా స్థానంలో తాగునీరు అందించే ఉద్దేశ్యంతో కొన్నేళ్ల క్రితం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఆర్‌వో ప్లాంట్ ద్వారా సజావుగా అందిన తాగునీరు ఏడాది కాలంగా ఎదురవుతున్న మరమ్మతులతో నేడు ప్రజలకు తాగునీరు సరిగా అందించలేని పరిస్థితి నెలకొంది. నీటిని శుద్ధి చేసే ఫిల్టర్లు మరమ్మతులకు గురికావ డంతో గత నెల తాగునీటి సరఫరా కు అంతరాయం ఏర్పడింది. మోటార్ వైండింగ్ రిపేరుతో నేడు నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడింది. గత నెల నీటిని శుద్ధి చేయకుండా ప్లాంట్ ద్వారా తాగునీటి సరఫరా చేయడంతో కలుషితంగా ఉన్న నీటిని తాగలేక ప్రజలు ఇబ్బందిపడిన పరిస్థితి నెలకొంది. ఆర్‌వో ప్లాంట్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికార యంత్రాంగం, ప్లాంట్ నిర్వాహకులు తగిన చర్యలు చేపట్టక పోవడాన్ని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌వో ప్లాంటునైనా సక్రమంగా నిర్వహించి తమకు స్వచ్ఛమైన నీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


జమ్ముతో నిండిన చెరువు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం గుంటూరుకు తరలింపు


అపస్మారక స్థితిలో ఉన్న ఇమ్రాన్

రోశయ్యకాలనీ (చీరాల), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని రోశయ్య కాలనీలో చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల నవాబ్‌పేటకు చెందిన షేక్ ఇమ్రాన్, రమీజాలు వరుసకు అన్నాచెల్లెళ్లు. ఇమ్రాన్ పెయింట్ పనిచేస్తున్నాడు. అయితే బ్యాంకు పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై రోశయ్య కాలనీలో నుంచి వీరు బైకుపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన వాహనం వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న ఇమ్రాన్ కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అపస్మారక స్థితిలోకి చేరాడు. ఆయన సోదరి రమీజా కాళ్లు చేతులకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు గుంటూరుకు తరలించారు. అలాగే మరో వాహనంపై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా వారికి స్వల్పగాయాలయ్యాయి. వీరు ప్రాథమిక చికిత్స తీసుకొని అక్కడి నుంచి వెళ్లారు.

మెరైన్ భవనం పనుల వేగం పెంచాలి

- ఎమ్మెల్యే కొండయ్య


మెరైన్ పోలీస్ స్టేషన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వాడరేవు(చీరాల), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో ప్రజాసేవకు వినియోగించే మెరైన్ పోలీస్ స్టేషన్ భవనాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. తీరంలో కొంత కాలంగా జరుగుతున్న భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

అనారోగ్య బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, జూన్18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడేవారికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సీఎంఆర్ఎఫ్ రూపంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 32 మందికి రూ.37,39,469 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరుకాగా, వారందిరికి, ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం భారీగా నిధులను ఖర్చు చేస్తోందన్నారు. దీనిలో భాగంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలను ఆదుకొంటోందన్నారు. పార్టీలు, గ్రూపులు, వర్గాలతో ప్రమేయం లేకుండా గ్రామాలలోని పేద కుటుంబాలకు ఆరోగ్యపరంగా ప్రభుత్వం సాయం అందించడానికి కంకణం కట్టుకొందన్నారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామేపల్లి హరిబాబు, కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, కోటపాటి సురేష్, మిన్నెకంటి రవికుమార్, నల్లపనేని రంగయ్యచౌదరి, గుదే తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై నిరసన


కమిషనర్ అబ్దుల్‌రషీద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

చీరాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని జిల్లా ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల కన్వీనర్ చిమటా వీరస్వామి కోరారు. బుధవారం మున్సిపల్ అబ్దుల్ రషీద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం రూ21వేల జీతభత్యం అందిచాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అందించాలన్నారు. రిటైర్‌మెంట్ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగేశ్వరరావు, చాంద్‌బాషా, అశోక్, కాంతారావు, చందు, సంగీతరావు, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి

- బీజేపీ మహిళామోర్చ అధ్యక్షురాలు యామినిశర్మ

అద్దంకి,జూన్18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకుపోవాలని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చ కార్యదర్శి యామినిశర్మ అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని గీతామందిరంలో జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజలు, మహిళల సాదక బాధ లు తెలిసిన మోడీ జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి, గ్యాస్ సిలెండర్లు, మహిళా ఆర్థిక స్వావలంభన పథకాలు అమలుజేస్తు న్నారన్నారు. ముందుగా శింగరకొండ వద్ద హరిహర గోకులంలోని ఆవులను పరిశీలించి మొక్కలు నాటారు. కార్య క్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, తమ్మన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యామినిశర్మ

చోరీ కేసులో దోషికి జైలు

చీరాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లులో ఇనుపరాడ్లను చోరీ చేసిన కేసులో దోషికి 10 నెలలు సాధారణ జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జె కాత్యాయని తీర్పును వెలువడించారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని తోటవారిపాలెంలో రంగినేని హనుమంతురావు వేటపాలెం మండల పరిధిలోని కొత్తపేటలో శివసాయి రైస్‌మిల్ నడుపుతున్నారు. ఈక్రమంలో కొత్తపేట పరిధిలోని పద్మనంఘంకు చెందిన కసుకుర్తి సుబ్బారావు అలియాస్ సుమంత్ గతేడాది సెప్టెంబర్‌లో రైస్ మిల్లులో సుమారు రూ.20 వేలు విలువైన 10 ఇనుప గ్రిల్స్, 5 ఇనుప పైపులు చోరీకి పాల్పడ్డాడు. ఈ మేరకు నమోదైన కేసులో డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ నాగభూషణం, ఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుల్ నాగరాజు సకాలంలో కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. అలాగే పబ్లిక్ ప్రాసిక్యూటర్ పద్మారెడ్డి వాదనలు వినిపించడంతో బుధవారం న్యాయాధికారి తీర్పు వెలువడించారు. నేరస్థులు కచ్చితంగా శిక్షించబడతారని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు.

తల్లికివందనంతో పేద కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పాటు


రాజీవ్‌కాలనీలో సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న అశోక్

అద్దంకి,జూన్18(ఆంధ్రజ్యోతి): తల్లికివందనం పథకం ద్వారా వచ్చిన నగదు పేద కుటుంబాలలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో తోడ్పాటుగా ఉంటుందని అద్దంకి పట్టణ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాకాని అశోక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం డబ్బులు జమ చేసిన నేపథ్యంలో అద్దంకి పట్టణంలోని రాజీవ్ కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ల ఫోటోలు ఉన్న ఫ్లెక్సీ కి విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి టీడీపీ నేతలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, చిలుకూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.